వైఎస్ఆర్ కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 02 ఫిబ్రవరి 2026

## పొలతల ఏర్పాట్లు పరిశీలించిన సీఐ చల్లనిదొర

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 1, (ప్రభాతవార్త):

మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం పొలతల క్షేత్రాన్ని పెండ్లిమర్రి సీఐ చల్లని దొర మరియు ఎస్సై తులసీ నాగప్రసాద్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలతల క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. కోనేర్ల వద్ద జాగ్రత్తలు పాటించాలని భక్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ రాజారెడ్డి, ఈవో కృష్ణానాయక్ పాల్గొన్నారు.



## పురవీధుల్లో ఊరేగిన స్వామి వారు

రామసముద్రం ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

మండల కేంద్రంలో కొలువైన శ్రీ లక్ష్మీ జనార్ధన స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి బటర్, కులశేఖర్ స్వామి వారు స్వామి వారిని సుప్రభాతం తో మేలుకొలిపి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. 10 రోజులు పాటు వివిధ రూపాల్లో దర్శనం ఇచ్చిన స్వామి వారు, ఈ ఉత్సవాలు భాగంగా స్వామివారి కళ్యాణోత్సవం శనివారం రాత్రి కన్నుల పండుగగా నిర్వహించారు.స్వామివారిని పలు రకాలపుష్పాలు,ఆభరణా లతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు.,స్వామి వారి కళ్యాణోత్సవం చూడడానికి భక్తులు తండోప తండాలుగా తరలివచ్చారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉంచి పురవీధులలో ఊరేగింపు చేసారు. ఈ వేడుకలు తిలకించడానికి విచ్చేసిన భక్తులకు శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం వారిచే అన్నదానం నిర్వహించారు.



# ముఖ్యమంత్రిని విమర్శిస్తే సహించేది లేదు

మదనపల్లె, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆదివారం మదనపల్లికి విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిని ఉద్దేశించి అవాకులు చవాకులు పేలితే తెలుగుదేశం పార్టీ శ్రేణుల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ అత్యంత క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, మా కార్యకర్తలు ఓపికగా ఉన్నారంటే అది మా నాయకత్వం నేర్పిన సంస్కారం అన్నారు. కానీ, మా ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలకు దిగితే మాత్రం చూస్తూ ఊరుకోబోమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కోటి 20 లక్షల మంది టీడీపీ కార్యకర్తలు ఒక్కసారిగా రోడ్లపైకి వస్తే మీరు తట్టుకోలేరన్నారు. వైసీపీ నాయకులు ఇలాగే తమ నాయకుల పై అసభ్య పదజాలంతో దూషిస్తే జగన్ బ్యాచ్‌కు 11 సీట్లు కూడా రావన్నారు. అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం లేక వైఎస్ జగన్ మరియు ఆయన అనుచరులు బయట కూర్చొని అనవసరపు విమర్శలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. గత ఎన్నికల్లో ప్రజలు మిమ్మల్ని 11 సీట్లకే పరిమితం చేసినా మీలో మార్పు రాకపోవటం సిగ్గుచేటు అన్నారు. ఇదే పద్ధతి కొనసాగించి, ముఖ్యమంత్రిని పదే పదే విమర్శిస్తే రాబోయే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా దక్కవని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యవహారశైలిని మంత్రి తీవ్రంగా తప్పుపట్టారు. అంబటి రాంబాబు తన స్థాయిని మర్చిపోయి మాట్లాడుతున్నారని, అధికారంలో ఉన్నప్పుడు అరాచకాలు చేసిన వ్యక్తులు ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే వైకాపా నేతలు ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. శాంతిభద్రతలకు విఘాతం





కలిగించేలా మాట్లాడితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని, ఇప్పటికే అంబటి రాంబాబుపై వస్తున్న ఫిర్యాదులే అందుకు నిదర్శనమని మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలుగు



యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చిన్నబాబు, పుంగనూరు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి, మదనపల్లి జనసేన ఇన్చార్జి రాందాస్ చౌదరి, మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### మంత్రి రాంప్రసాద్ రెడ్డికి గజమాలతో ఘన స్వాగతం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం మదనపల్లె పర్యటనకు విచ్చేసిన సందర్భంగా మదనపల్లి నియోజకవర్గ టిడిపి నాయకులు,కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరైన ఆయనకు క్రేన్ సహాయంతో భారీ గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. మంత్రి శ్రీకృష్ణదేవరాయలు సర్కిల్ కు చేరుకోగానే టిడిపి అభిమానులు భారీ సంఖ్యలో హాజరై ఆ ప్రాంతం మారు మ్రోగే విధంగా బాణాసంచా, డప్పు వాయిద్యాలతో ఆనందోత్సాహాల మధ్య మంత్రికి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈకార్యక్రమంలో పుంగనూరు ఇన్చార్జ్ చల్లా బాబు,తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చిన్నబాబు, టిడిపి సీనియర్ నాయకుడు సీడ్ మల్లికార్జున్ నాయుడు, రాటకొండ బాబు రెడ్డి, యాలగిరి దొరస్వామి నాయుడు, మహబూబ్ ఖాన్, నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు మదనపల్లె కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ వేదిక

మదనపల్లె, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లా మదనపల్లె కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించేందుకు సోమవారం ఉదయం 10గంటల నుండి ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు జిల్లా కేంద్రం మదనపల్లెతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా నిర్వహించే పిజిఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్జీదారులు మీకోసం.ఎపి.జిఓవి.ఇన్ వెబ్‌సైట్‌ను నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల ప్రస్తుత స్థితి సంబంధించి సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## కడప శిల్పారామంలో దేశభక్తి గీతాలు..

కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:

కడప శిల్పారామం సాంస్కృతి కళావేదిక మీద మిస్స వారి సహకారంతో కడప నగరం చిన్నచౌక్ చెందిన ఇండస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ చెందిన విద్యార్థులు విద్యార్థులచే సాంప్రదాయ వస్త్రధారులతో దేశభక్తి గీతాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తమ పిల్లలు స్టెప్పులకు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. మేమే ఇండియన్స్ మేమే ఇండియన్స్, మీసాల పిల్ల మీసాల పిల్ల, రామ చిలకమ్మ పాటలు వీక్షకులను అలరించాయి. సంస్కృతిక కార్యక్రమాలను శిల్పారామం పరిపాల అధికారి ఎస్. కృష్ణ ప్రసాద్ పర్యవేక్షించారు.



## దొంగతనాలపై అవగాహన సమావేశం

ప్రొద్దుటూరు క్రైం, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:

మీ భద్రత మీ చేతుల్లోనే ఉంది. అప్రమత్తతే మీ భద్రత అనే నినాదంతో ప్రొద్దుటూరు పట్టణంలోని హ్యాపీ హోమ్స్‌లో దొంగతనాల నివారణ, సైబర్ క్రైం మరియు రోడ్డు ప్రమాదాలు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని ప్రొద్దుటూరు రూరల్ సీఐ ఎం.నాగభూషణ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం బంగారు ధరలు పెరిగిన నేపథ్యం కారణంగా దొంగతనాలు, చైన్ స్నాచింగ్ ఇతర రాష్ట్రాల దొంగల గ్యాంగ్‌ల ద్వారా ఇంటి దోపిడీలు జరిగే అవకాశం ఉంది. కాలనీ ప్రజలు ముఖ్యంగా ఇంటి వద్ద ఉండే మహిళలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు. ఇంటికి బలమైన తాళాలు ఏర్పాటు చేసుకోవాలని కుక్కలు పెంచడం ద్వారా అప్రమత్తత ఉంటుందన్నారు. వీలైతే ప్రతి ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. ప్రజలు మరో పట్టణాలు లేదా గ్రామాలకు వెళ్తున్నప్పుడు ఎల్‌హెచ్‌ఎంఎస్ (లోకల్ హెల్ప్‌లైన్ మరియు మానిటరింగ్ సిస్టం) ఉపయోగించి తాము ఉన్న ప్రదేశం, లొకేషన్ మరియు ప్రయాణ వివరాలు పోలీసులకు తెలిపతే భద్రత కల్పిస్తామని సీఐ తెలిపారు. అదే విధంగా డిజిటల్ అరెస్ట్ పేరుతో వచ్చే ఫేక్ కాల్స్ మరియు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలంటూ వచ్చే ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ప్రొద్దుటూరు రూరల్ ఎస్సై శ్రీకాంత్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## ప్లాంట్ పనులను పరిశీలించిన గౌతం అదానీ

### రూ.2,300 కోట్ల వ్యయంతో నిర్మాణం 500 మెగావాట్ల సామర్థ్యం

పులివెందుల, ఫిబ్రవరి 1, ప్రభాత వార్త :

పార్నపల్లె సమీపంలో నిర్మాణంలో ఉన్న రూ.2,300 కోట్ల వ్యయంతో కూడిన 500 మెగావాట్ల హైడ్రో పంప్డ్ స్టోరేజీ ప్లాంట్‌ను అదానీ గ్రూపు సంస్థల చైర్మన్ గౌతం అదానీ, ఆయన కుమారుడు, సంస్థల సీఈవో జీత్ అదానీ శనివారం పరిశీలించారు. కడప విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో పార్నపల్లి డ్యాం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న అదానీ బృందం, అక్కడి నుంచి రోడ్డు మార్గాన ప్లాంట్ ప్రాంగణానికి వెళ్లారు.





గౌతమ్ ఆదానికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఈ సందర్భంగా ప్లాంట్‌లోని గణేష్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్లాంట్‌లో కొనసాగుతున్న నిర్మాణ పనులు, ప్రగతి స్థాయి, భద్రతా చర్యలు తదితర అంశాలపై సిబ్బందితో అదానీ, జీత్ అదానీ సమీక్షించారు. ప్రాజెక్టు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ హైడ్రో పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ పూర్తయితే రాష్ట్ర విద్యుత్ అవసరాలకు గణనీయమైన మద్దతు లభించనుందని, పునరుత్పాదక ఇంధన రంగంలో ఇది కీలక ప్రాజెక్టుగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.

## నాణ్యత, భద్రతా ప్రమాణాలతో నిర్మాణ పనులు చేపట్టాలి

కడప, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :

పర్యావరణానికి ఎలాంటి అంతరాయం లేకుండా, నిబంధనలకు లోబడి అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కడప ఎయిర్ పోర్ట్ నూతన టర్మినల్ భవన నిర్మాణ పనులను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఎయిర్ పోర్ట్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం కడప ఎయిర్ పోర్ట్ ప్రాంగణంలో నూతన టర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్ పోదర్ తోకలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పౌర విమానయాన సేవారంగంలో ప్రయాణీకుల అనుభవాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని భారతీయ విమానాశ్రయాలను ఉన్నత ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయికి దీటుగా నూతన టెర్మినల్ భవన నిర్మాణాలను పటిష్టంగా చేపట్టాలన్నారు. ఎయిర్ పోర్టు పరిసరాల్లో ఎలాంటి అనధికారిక చర్యలు కానీ, భద్రతకు భంగం వాటిల్లే సంఘటనలు కానీ, నిర్మాణ పనులకు ఆటంకం కలిగించే చర్యలు కానీ చోటు చేసుకోకుండా రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నూతన డొమెస్టిక్ టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనులను అత్యంత నాణ్యతతో, భద్రతా ప్రమాణాలతో నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ఎయిర్ పోర్ట్ నూతన టర్మినల్ భవన నిర్మాణ పనుల్లో భాగంగా పర్యావరణానికి ఎలాంటి అంతరాయం కలగకుండా ఏరో డ్రమ్ నిర్మాణ పనులను చేపట్టేందుకు సంబందిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, రెవెన్యూ, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మొదలైన ఇంటర్ ప్రాక్టికల్స్

### పరిశీలించిన స్టేట్ అబ్జర్వర్ అశ్వర్థ శెట్టి

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు ప్రాక్టికల్ పరీక్షలను స్టేట్ అబ్జర్వర్ సి. అశ్వర్థ శెట్టి తనిఖీ చేశారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి తో కలిసి ఆయన రాయచోటి, మదనపల్లి ప్రాంతాల్లోని 15 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అశ్వర్థ శెట్టి మాట్లాడుతూ నిఘా నీడలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల నిర్వహణను పూర్తి పారదర్శకత తో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పరీక్షా విధుల్లో ఉన్న చీఫ్ సూపరింటెండెంట్లు, ఎగ్జామినర్లు ప్రాక్టికల్ పరీక్షలను మాస్ కాపీయింగ్ లేకుండా నిర్వహించాలని సూచించారు. తనిఖీలో గుర్తించిన కొన్ని చిన్నపాటి లోటుపాట్లను సరిదిద్దుకోవాలని వారికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వటం జరిగిందన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరిగినా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినా సహించేది లేదన్నారు. ఏవైనా లోపాలు కనిపిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా జనరల్ విభాగంలో 39 కేంద్రాలు, ఒకేషనల్ విభాగంలో 2 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని డిఐఈఓ రవి కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు.



## శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

### తొమ్మిది రోజులు పాటు శ్రీరంగని ఉత్సవాలు

పులివెందుల, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :

పులివెందుల వెలసిన పురాతన శ్రీ రంగనాథ స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఆదివారం ఉదయం అంకురార్పణ గావించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ రాజేష్ శర్మ నేతృత్వంలో వీర ఫణీంద్ర శర్మ,నాగేంద్ర ఫణీల ఆధ్వర్యంలో స్వామివారికి ఈ కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం స్వామివారనీ శ్రీదేవి భూదేవి అమ్మవార్లను పల్లకిలోంచి ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకొని వచ్చారు. స్థానిక పూలంగళ్ళవద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో సూర్యప్రభ వాహనంపై ఉదయం శ్రీ రంగనాథ స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్లను గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్ రెడ్డి, ఈవో కెవి రమణ, దేవస్థానం కార్యవర్గ సభ్యులు మల్లికార్జున, మాదాచారి, పట్టాభి రామయ్య, నాగ బత్తుల శేఖర్, దశరథ రామిరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ అల్లం రంగనాయకులు రాయల్ , ఫణి రాజు మాజీ చైర్మన్ వనిడా సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### ఒకటి నుండి 9వ తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలు

మొదటిరోజు ఆదివారం తాళ భజన కార్యక్రమం, రెండో రోజు హరికథ, మూడవరోజు గాలివీడు వాస్తవాలు నాగేశ్వరరావు బృందం చే సాసవల చిన్నమ్మ కథ, నాలుగో రోజు యువరాజు బృందం చే సాంస్కృతిక కార్యక్రమాలు, ఐదో తేదీ నృత్య ప్రదర్శనలు, ఆరో తేదీ సాంస్కృతి కార్యక్రమాలు, ఏడో తేదీన రథోత్సవం ముంగిట కోలాటం, ఎనిమిదో తేదీన వాల్మీకి నాట్యమండలి పులివెందుల వారిచే పూర్తి నాటకము, 9వ తేదీ నవరత్నాలు అనే కార్యక్రమాలు జరగనున్నాయి.

### చంద్రప్రభ వాహనంపై శ్రీ రంగనాథుడు

శ్రీ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథ స్వామి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు అనంతరం స్వామి వారు గ్రామ పర్యటన కావించారు.

## పెద్ద చెరువు తూము మరమ్మతులతో జలకళ

### విజయమ్మ, రితేష్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపిన రైతులు

బద్వేలు, ఫిబ్రవరి 1 (ప్రభాతవార్త):

గత కొంతకాలంగా బద్వేలు నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ఎల్ఎస్‌పి డ్యామ్ పరిధిలోని పెద్ద చెరువులో గణనీయంగా నీరు చేరింది. ఎంతోకాలంగా నీరు లేకుండా ఉన్న నేపథ్యంలో ఈ వర్షం నీటితో ఈ ప్రాంత రైతుల్లో పంటలపై ఆశలు చిగురించాయి. అయితే, పెద్ద చెరువు నుండి ఇతర అనుబంధ చెరువులకు నీరు చేరాల్సిన తూము మరమ్మతుల లోపంతో పనిచేయకపోవడం వల్ల నీరు దిగువ ప్రాంతాలకు చేరక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నీరు ఉన్నప్పటికీ పంటలకు ఉపయోగపడకపోవడంతో రైతులు నానా అవస్థలు పడగా, ఈ సమస్యపై టిడిపి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ , యువనేత రితేష్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. సంబంధిత సమస్యను ఎల్ఎస్పి డ్యామ్ చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి వారి దృష్టికి తీసుకెళ్లారు. విజయమ్మ, హరితేజ రెడ్డి ఇలా ఆదేశాల మేరకు తక్షణమే స్పందించి, తమ సొంత నిధులతో తూము మరమ్మతుల పనులను అధిక వ్యయ ప్రయాసలు కోర్చి పూర్తి చేశారు. తూము మరమ్మతులు పూర్తికావడంతో పెద్ద చెరువు నుంచి నీరు ఇతర చెరువులకు చేరి, దిగువ ప్రాంతాల్లోని సాగునీటి అవసరాలు తీరుతున్నాయి. దీంతో పంటలు వేసుకునేందుకు అవసరమైన నీరు అందుబాటులోకి రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రబీ సీజన్‌లో సాగుకు ఈ నీరు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, ప్రభుత్వ స్థాయిలో పనులు ఆలస్యం అవుతున్న సమయంలో టిడిపి నేతలు ముందుకు వచ్చి సమస్యను పరిష్కరించడంపై కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రజా సమస్యలపై నాయకులు స్పందించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఎల్ఎస్‌పి డ్యామ్ మరమ్మతుల వల్ల చెరువులకు జలకళ వచ్చి, బద్వేలు ప్రాంతం మరోసారి పచ్చని పొలాలతో కళకళలాడుతుందన్న నమ్మకాన్ని ఈ చర్య కలిగించిందని స్థానికులు పేర్కొన్నారు.



### అంబటి తీరు సరికాదు;

ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబుపై తక్షణ చర్యలు తీసుకోవాలనీ ఎల్ఎస్పి డ్యాం చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు.రాజకీయాల్లో విమర్శలు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా నిర్మాణాత్మకంగా ఉండాలే గానీ, వ్యక్తిగత విమర్శలకు దిగడం సరైంది కాదని స్పష్టం చేశారు. గతంలో కూడా అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి గారి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఘటనలను ఆయన గుర్తు చేశారు. అంబటి రాంబాబు వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## అంగళ్లులో విద్యార్థులు ర్యాలీ

కురబలకోట ఫిబ్రవరి 1 ప్రభాత వార్త

మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ నందు ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో గ్రామజ్యోతి సొసైటీ (మదనపల్లి), ది మూమెంట్ గ్లోబల్ ఫౌండేషన్ (ముంబై) వారి సహకారంతో మానవ అక్రమ రవాణా, మహిళలు-పిల్లల ప్రాథమిక హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విద్యార్థులు అంగళ్లు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మిట్స్ యూనివర్సిటీ ప్రాంగణం నుండి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి. కమల్ బాషా కార్యక్రమాన్ని ప్రారంభించారు., యూనివర్సిటీ నుండి అంగళ్ళు కూడలి వరకు ర్యాలీ సాగించి విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామజ్యోతి సొసైటీ ప్రతినిధి బి. శుభద్ర మాట్లాడుతూ మహిళలపై లైంగిక దాడులు, చిన్నపిల్లల అపహరణ, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా వంటి సమస్యలతో పాటు నకిలీ ఏజెంట్లను నమ్మి కువైట్, సౌదీ, ఖతార్ వంటి దేశాలకు వెళ్లి మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ మహిళలు, చిన్నపిల్లల అపహరణ, ర్యాగింగ్, సైబర్ నేరాలు వంటి ఘటనలు జరిగితే 100, 181, 1930, 1098 నంబర్లకు వెంటనే ఫోన్ చేయాలని సూచిస్తూ పోలీస్ శాఖ తక్షణ సహాయం అందిస్తుందని తెలిపారు. ర్యాలీ అనంతరం గ్రామజ్యోతి సొసైటీ ప్రెసిడెంట్ బి. శుభద్ర విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి యూనివర్సిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. మిట్స్ యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్ పి.రాజేష్ మాట్లాడుతూ ర్యాలీ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన మిట్స్ ఫౌండర్ ఛాన్సలర్ డాక్టర్ యెన్ విజయ భాస్కర్ చౌదరి, ప్రోఛాన్సలర్ యెన్ ద్వారకానాథ్ మరియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, కోఆర్డినేటర్ పి. రాజేష్, గ్రామజ్యోతి సొసైటీ ప్రెసిడెంట్ బి. శుభద్ర, మదనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా శివపార్వతుల కళ్యాణం

బద్వేల్ అర్బన్ ఫిబ్రవరి 01 ప్రభాతవార్త :

మాఘమాసం పురస్కరించుకొని పౌర్ణమి సందర్భంగా ఆదివారం బద్వేల్ మున్సిపాలిటీ పరిధి నెల్లూరు రోడ్ ఆంజనేయ నగర్‌లో సముద్రాల రాధాకృష్ణమూర్తి సతీమణి ప్రణీత కుమారుడు ఈశ్వర్ కుమార్తె గాయత్రి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ శివపార్వతుల కళ్యాణ మహోత్సవం కార్యక్రమాన్ని వేదపండితుల ఆధ్వర్యంలో కనుల పండగగా నిర్వహించారు, మాఘమాసం సందర్భంగా పౌర్ణమి నాడు శివపార్వతుల కళ్యాణం మహోత్సవం నిర్వహించడం వలన బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ఏరియాలనుంచి ఆర్యవైశ్యులు మరియు వార్డులో ప్రజలందరూ కూడా స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు,ఈ సందర్భంగా వేద పండితులు కృష్ణపాటి లక్ష్మీనారాయణ శాస్త్రి మాట్లాడుతూ మాఘ మాసంలో పౌర్ణం రోజు శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని చేపట్టడం వలన అనేక శుభ ఫలితాలు సిద్ధిస్తాయని సకాలంలో వర్షాలు, వ్యాపారాలు, పాడిపంటలు మరియు అనేక రకాలుగా స్వామివారి ఆశీర్వాదాలు ఉంటాయన్నారు, మాఘ మాసంలో స్వామివారి కళ్యాణ మహోత్సవం చేపించిన కళ్యాణంలో పాల్గొన్న అనేక శుభ ఫలితాలు సిద్ధిస్తాయని అనంతరం శివపార్వతుల కళ్యాణ విశిష్టతను భక్తులకు విరివిరిగా వారు తెలియజేశారు, శివపార్వతుల కళ్యాణం లో పలువురు భక్తులు స్వామి వారికి అక్షింతలు పుష్పాలు, కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు, కళ్యాణోత్సవం లో పాల్గొన్న పలువురు భక్తులు, ప్రజలు ఆర్యవైశ్యులు అందరికి స్వామి వారి ప్రసాదాలు అనంతరం అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు పి.వి.ఎన్ ప్రసాద్, కే.వి సుబ్బారావు, భూపాలం నాగరాజారావు గుప్తా బ్రదర్స్, సుబ్బారావు తుమ్మలపెంట సురేష్‌బాబు, తులసి వెంకట శివనారాయణ, జొన్నలగడ్డ సుధాకర్ చక్రపాణి, శ్రీనివాస్ రెడ్డి రాజశేఖర్ ఆచారి,దస్తగిరి, శ్రీరాములు, రామచంద్రరెడ్డి, ఉరిమి సుబ్బారావు, పెసల సుబ్రహ్మణ్యం, దర్శి సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, సముద్రాల దత్తాత్రేయ, రాజేంద్ర, విశ్వ, యాదాళ్ల కృష్ణమూర్తి దర్శి సుబ్బరాజు, కొలిశెట్టి నాగరాజు, కృష్ణయ్య, ముచ్చర్ల సుధాకర్ రావు, ప్రవీణ్,పెద్దిరెడ్డి, చప్పరపు సుబ్బారావు, వాసు, బీరం చంద్రశేఖర్ రెడ్డి, తో పాటు పలువురు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు బాధాకారం

లక్కిరెడ్డిపల్లి: ఫిబ్రవరి 01 ప్రభాత వార్త



ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేత అంబాటి రాంబాబు చేసిన అనుచిత, ఆ సభ్య వ్యాఖ్యలను అటవీ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ యర్రగొల్ల రెడ్డయ్య యాదవ్,మాజీ డిసిసి బ్యాంక్ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి ఖండించారు తీవ్రంగా ఖండించారు. ఒకప్పుడు మంత్రిగా నిర్వహించిన వ్యక్తి స్థాయిని పూర్తిగా మరిచి సభ్య సమాజం తలగించుకునేలా ముఖ్యమంత్రిని బూతులు తిట్టడం అత్యంత దిగజారుడు రాజకీయానికి నిదర్శనం అన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శ కులకు స్థానం ఉన్న, అది సంస్కార బద్ధంగా, గౌరవంగా ఉండాలని వ్యక్తిగత దూషణలకు, అసభ్య పదజాలం ప్రజా జీవితంలో ఉన్న నాయకులకు ఏమాత్రం శోభించవని ఇటువంటి వ్యాఖ్యల తో అంబాటి రాంబాబు తన రాజకీయ అవగాహన స్థాయిని, సంస్కార రాహిత్యాన్ని ప్రజల ముందు మరోసారి బయటపెట్టుకున్నారన్నారు.

## క్రీడలు జాతీయ సమైక్యత పెంపొందిస్తాయి

లక్కిరెడ్డిపల్లి: ఫిబ్రవరి 01 ప్రభాత వార్త



క్రీడలు ఆనందాన్ని, ఆరోగ్యాన్ని ,సమైక్యతను పెంపొందిస్తాయని కొనంపేట సర్పంచ్ లక్ష్మీనారాయణ అన్నారు. భారత యువ కేంద్ర సహకారంతో శ్రీ వెంకటేశ్వర యూత్ డేవేలప్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యువతకు బ్లాక్ లెవెల్ వాలీబాల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ హాజరయ్యారు. క్రీడలను ప్రతిఒక్కరూ రోజువారీగా భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. విన్నర్ గా నిలిచిన సుదర్శన టీం కు 3000 రూ ,రన్నర్ గా నిలిచిన మహేష్ టీం కు 2000 రూ నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు,స్పోర్ట్స్ కిట్స్ అందించారు. ఈకార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర యూత్ డేవేలప్మెంట్ అధ్యక్షుడు సోమల వెంకటేశ్వర, బ్లాక్ కో ఆర్డినేటర్ లు బాలాజీ,సిద్దార్థ పాల్గొన్నారు.

## వైసిపి బలోపేతానికి గ్రామ కమిటీలే కీలకం

పీలేరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



మాట్లాడుతున్న దండు జగన్మోహన్ రెడ్డి

వైఎస్సార్సీపీ మరింత బలోపేతానికి గ్రామ కమిటీలే కీలకమని పార్టీ మండల కన్వీనర్ దండు జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గూడరేవుపల్లె, బోడుమలవారిపల్లె గ్రామ పంచాయతీలలో వైఎస్సార్సీపీ గ్రామ కమిటీ రచ్చబండ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కమిటీలో వివిధ పదవులు పొందిన వారు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్సీపీ విధానాలు, కూటమి ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరించాలని కోరారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అమరనాథరెడ్డి. నాయకులు రామస్వామిరెడ్డి, చిన్నబాబు, వెంకటస్వామిరెడ్డి, వినాయకం. బలరాం. సి.కె. వెంకటేష్, చిట్టిబాబు, బద్రీనాయక్, యల్లయ్య, నాగరాజ, బి..సి. జ్ఞాన శేఖర్ రెడ్డి, బి.సి. అమరనాథరెడ్డి, అక్బర్, మదన్, శీను, వేణు, మునిరాజ, ఆనంద్, కాలనీచిన్న. షాకీర్, సురేంద్రరెడ్డి, మునీర్, ఉబేదుల్లా, అబీద్, విక్టరీ వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బడుగు,బలహీన వర్గాల అభివృద్ధి బీఎస్పీ తోనే సాధ్యం

రామసముద్రం ఫిబ్రవరి 1ప్రభాత వార్త



దేశంలోని బడుగు బలహీనర్గాల అభివృద్ధి బహుజన సమాజ్వాది పార్టీతోనే సాధ్యం అవుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందేల గౌతమ్ స్పష్టం చేశారు. రామ సముద్రం మండల బీఎస్పీ అధ్యక్ష ఎన్నిక కోసం ఆదివారం ఏర్పాటు చేసిన సవేశంలో ఆయన పాల్గొన్నారు. రామసముద్రం మండలం బీఎస్పీ అధ్యక్షులుగా పైగడ్డకు చెందిన నరసింహులు, ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మండలంలోని అన్ని పంచాయతి లలో సర్పంచ్ ,,ఎంపీటీసీ లలో బీఎస్పీ పోటీ చేస్తుందని, ఇందుకు గాను మండల అధ్యక్షులు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం కొత్తగా ఎంపికైన మండల అధ్యక్షులు నరసింహులు, ఉపాధ్యక్షులు సోము, ప్రధాన కార్యదర్శి బాబు కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా బీఎస్పీ ఇంచార్జ్ మిద్దేపల్లి బాలాజీ, జిల్లా సెక్రటరీ శివ, జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, ప్రశాంత్, అరుణ్, రాజేష్, బాలకృష్ణ, రెడ్డప్ప, శశి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## 4 న ఈశ్వరిదేవి ఆలయం లోవేలం పాటలు

బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 1ప్రభాత వార్త

శ్రీ జగన్మాత ఈశ్వరి దేవి మఠాధిపతి వీర శివకుమార్ స్వామి ఆధ్వర్యంలో నాలుగో తేదీన బహిరంగంగా ఆలయంలో వేలం పాటలను నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వణాధికారి అధికారి జగన్మోహన్ రెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. కొబ్బరి చిప్పలు వసూలు చేసుకునే హక్కునకు, మరుగుదొడ్లు నిర్వహణ రుసుం హక్కునకు, భక్తుల తలలీలాలు హక్కునకు, పాదరక్షకుల భద్రపరచుకునే హక్కునకు, భక్తుల సమర్పించుకున్న అమ్మవారి చీరలు వేలంపాటకు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చును. 01.04.2026 వ తేదీ నుంచి 31.03.2027 వ తేదీ వరకు కాలపరిమితి వుండును. నాలుగో తేదీ ఉదయం 10 గంటలకు ఈశ్వరి దేవి ఆలయంలోని బహిరంగంగా వేలం పాటలో ఉంటాయన్నారు. పాత బకాయిలు ఉన్నవారు వేలం పాటలో పాల్గొనేందుకు ఉండదన్నారు, వేలంపాటలో పాల్గొని మూడు నెలలు గడువు లోపల మిగతా డబ్బులు చెల్లించవలనను తెలియజేశారు,

## సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి

మదనపల్లె, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్కోడ్ లను రద్దు చేయాలని ఈ నెల 12న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి క్రిష్ణప్పలు కోరారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ సమ్మెకు సంఘీభావంగా సిపిఐ,ఏఐటియుసి, వ్యవసాయ, కార్మిక సంఘం, దళితహక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సమ్మెకు తరలి రావాలన్నారు. పేద కార్మిక, రైతాంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం కార్మిక, రైతాంగ వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పోరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. లేబర్ కోడ్లను రద్దు చేసేంతవరకు ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. ఈవిధానం ద్వారా కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మాదవ్, జిల్లా అధ్యక్షులు హరి, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి తిరుమల, రెడ్డప్ప, చిన్నప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## క్యాట్ లెవెల్2 లో శ్రీ చైతన్య విద్యార్థుల విజయకేతనం

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :

పట్టణ సమీప రాజేశ్వరి కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఐకాన్ మరియు సిబ్యాచ్ విద్యార్థులు క్యాట్ ఒలంపియాడ్ పరీక్షలో ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ఏజియం నాగిరెడ్డి మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో క్యాట్ లెవెల్2లో 161 మంది విద్యార్థులు విజయం సాధించారని, అందులో 29 మంది 29 వేల రూపాయల నగదు బహుమతి,78 మంది పథకాలు, 54 మంది ప్రసంశ పత్రాలు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ మురళీధర్ రావు, ప్రిన్సిపల్ వినోద్, కీర్తన, దీన్ పవన్, ఇంచార్జ్ జనార్ధన్, జయరాజు, ఉపాధ్యాయ బృందం పాల్గొని ఇంతటి విజయానికి కారణమైన విద్యార్థులను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.



## అంబటి రాంబాబు దిష్టిబొమ్మ దగ్ధం

పీలేరు ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



ప్రజా సంక్షేమం అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడి పని చేస్తున్న బాధ్యత గల ముఖ్యమంత్రి పై వైసిపి నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపాయి. అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి శ్రేణుల నిరసనలు, నినాదాలు పెద్ద ఎత్తున వెలువత్తాయి. అందులో భాగంగా కలికిరి పట్టణంలోని అమర్నాథ్ రెడ్డి భవనంలో కూటమి శ్రేణులు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు నల్లారి అభిమానులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు అంబటి రాంబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఆయన దిష్టిబొమ్మని దగ్ధం చేశారు. వైసిపి నాయకులు రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు రౌడిల్లా ప్రవర్తించి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి వైసీపీ పార్టీలో రౌడీలను, గుండాలను పెంచి పోషిస్తూ వారు చేస్తున్న వ్యాఖ్యలపై రాక్షసానందం పొందుతున్నారని దుయ్యబట్టారు. అనంతరం కార్యాలయం ఎదురుగా వైసిపి నేత అంబటి రాంబాబు పై వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మని దగ్ధం చేశారు. అంబటి రాంబాబు పై చట్టపరంగా చర్యలు తీసుకుని శిక్షించాలని, ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృత్తం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను కోరారు.

## గాండ్ల కుల సమైక్యత, సంక్షేమమే ధ్యేయం

రాష్ట్ర అధ్యక్షుడు గ్రోస్ సుబ్బారావు

మదనపల్లి ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



గాండ్ల కులస్తులు అందరూ సమైక్యంగా పోరాడి సంక్షేమాన్ని సాధించాలని అఖిల గాండ్ల తెలుగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గ్రోస్ సుబ్బారావు పేర్కొన్నారు. గాండ్ల కుల మాఘమాస వనభోజనాలు ఆదివారం మండలంలోని పోతబోలు పంచాయతీ దేవలంబండ వద్ద వైభవంగా జరిగాయి సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటరమణతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బారావు మాట్లాడుతూ అందరూ ఐకమత్యంతో ఉండాలని పిలుపునిచ్చారు. స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గోమాతకు, కులానికి ఆధారమైన గానుగకు ప్రత్యేక పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ బాబు రాజా, సత్యనారాయణ, కొండయ్య కేవీ ప్రసాద్, శిరీ లక్ష్మీ రమణ, నాగరాజా, సిపిఎం క్రాస్ రోడ్ సర్పంచ్ బండపల్లి ఈశ్వరమ్మ, పోతు బోల్ సర్పంచ్ ఈశ్వరయ్య, శెట్టివారి చంద్ర, కృష్ణప్ప, నారా నరసింహులు, గోపితపాలెం నవీన్ తదితరులు పాల్గొన్నారు. అఖిల గాండ్ల తెలుపుల సంక్షేమ సంఘం మదనపల్లి నియోజకవర్గం నూతన కమిటీని అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సంఘం నియోజవర్గ అధ్యక్షులుగా కె.వి.ప్రసాద్ బుజ్జి, కార్యదర్శిగా సిహెచ్ కృష్ణ ఎన్నికయ్యారు. 27 మందితో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసారు.

## కేంద్ర బడ్జెట్లో రాష్టానికి మొండిచేయి

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లె, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :



కేంద్ర బడ్జెట్లో ఆర్థికశాఖామంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్కు మొండిచేయి దక్కిందని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ తెలిపారు. ఈ బడ్జెట్లో కార్మికులు, కష్టజీవులు, స్కీంవర్కర్లు వారి సమస్యల గురించి ప్రస్తావనే లేదన్నారు.ఈ సందర్భంగా సాంబ మాట్లాడుతూ ఈనెల 12న దేశవ్యాప్తంగా సమ్మె చేపడుతున్న సమస్యలను బడ్జెట్లో ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. విభజన చట్టంలో పేర్కొనబడిన జాతీయ విద్యాసంస్థలకు నిదులు కేటాయింపు విషయంలో విశాఖరైల్వే జోన్, విశాఖ ఉక్కు దుగరాజపట్నం, వైజాగ్ విజయవాడ మెట్రోలు ఏయిమ్స్ లాంటి సంస్థలు వెనుకబడిన జిల్లాలకు ఆర్థికసాయం, అమరావతి రాజధానికి నిధులు కేటాయింపు, పోలవరంకు నిధులు కేటాయింపు వంటి విషయాలల్లో అన్యాయంగా వ్యవహరించిందని తెలిపారు. పెండింగ్లో ఉన్న ప్రజాఎక్టులు పూర్తి చేయాలని తెలిపారు. కృత్రిమ మేధ కారణంగా ఎదురయ్యే నిరుద్యోగ సమస్య గురించి, కార్మికుల వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నా వాటిపై బడ్జెట్లో ప్రస్తావన లేదన్నారు. ధరలు పెరుగుదల, అవినీతి రుపాయి విలువ పతనం, పెట్రోల్, డీజల్, గ్యాస్ ధరలు తదితర అంశాలపై ఊసేలేదన్నారు. మొత్తంగా బడ్జెట్ సామాన్యునికి తీవ్ర నిరాశను కలిగించిందని కార్పోరేట్లకు అనూకులంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ కిసాన్ మోర్చ ఉపాధ్యక్షునిగా సంగటి రామమోహన్రెడ్డి

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:



పెండ్లిమర్రి మండలం, కొత్తపేట గ్రామ నివాసి సంగటి రామమోహన్రెడ్డిని కడప జిల్లా బీజేపీ కిసాన్ మోర్చ ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంగటి రామ మోహన్రెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరంచిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కు, కడప జిల్లా అధ్యక్షుడు జంగేటి వెంకట సుబ్బారెడ్డికి, కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు టి.కుమారస్వామికి, జిల్లా అధ్యక్షుడు అశోక్ కుమార్రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. మార్క్ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ వి.శశిభూషణ్రెడ్డికి, కూటమి నాయకులు, టీడీపీ మరియు జనసేన కడప జిల్లా నాయకులకు ధన్యవాదాలన్నారు.

## మురళి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

పులివెందుల, ఫిబ్రవరి 1, ప్రభాత వార్త :



పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు సమీపంలో ఉన్న నాగల కట్టు వద్ద ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, బలిజ సంఘం నాయకుడు కొంగనపల్లి మురళి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు విశేషంగా తరలివచ్చి అన్నదానాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కొంగనపల్లి మురళి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని, అదే విధంగా ఈ సంవత్సరం కూడా భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్నదానం మహాదానం అని, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సౌహార్దాన్ని పెంపొందిస్తాయని ఆయన అన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో కొంగనపల్లి కొండల రావు, వారి కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకుడు హాల్ గంగాధర్ రెడ్డి, చంద్రతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తి వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## వికసిత భారత్ లక్ష్యంగా బడ్జెట్..

వేంపల్లె ఫిబ్రవరి 01 (ప్రభాత వార్త)



వికసిత భారత్ లక్ష్యమే భాజపా ధ్యేయం అని భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ఈ మేరకు వేంపల్లిలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ 3.0 పాలనలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 9వసారి బడ్జెట్ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఇది ఆర్థిక వృద్ధి, ఉద్యోగ, సృష్టి, రైతుల, పేదల శ్రేయస్సు పై ప్రధాన దృష్టి పెట్టిన యువశక్తి బడ్జెట్గా నిలుస్తుందన్నారు. సాధారణ ప్రజల శ్రేయస్సు కుదరచడం ఉద్యోగ అవకాశాలను సృష్టించడం పేపర్ రంగానికి మద్దతు ఇవ్వడం వంటి చర్యల ద్వారా ఈ అభివృద్ధి సాధ్యమైందని అన్నారు. వ్యవసాయం నుంచి పరిశ్రమల వరకు తీర ప్రాంతం నుంచి కొండల వరకు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అండగా కేంద్ర బడ్జెట్ ఉందని తెలిపారు.

## అంబటి పై చర్యలు తీసుకోవాలి

వేంపల్లి:ఫిబ్రవరి 01(ప్రభాత వార్త)



వైసిపి నేత అంబటి రాంబాబు వ్యాఖ్యలు సమాజానికి సిగ్గు చేటు అని, సిఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వేంపల్లె మండలం తెలుగుదేశం పార్టీ కన్వీనర్ రామమునిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అంబటి రాంబాబు వ్యవహారం హద్దులు దాటిందని, సిఎం చంద్రబాబుపై అంబటి ఉపయోగించిన భాష.. సభ్య సమాజం తలదించుకునేలా ఉందని మండిపడ్డారు. అంతేకాకుండా ఏపి సిఎం చంద్రబాబుకు అంబటి రాంబాబు బేషరతుగా క్షమాపణ చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, వేంపల్లె పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, సీనియర్ నాయకులు పాపిరెడ్డి, క్లస్టర్ ఇంచార్జి మహమ్మద్, బీసీ నాయకులు రమేష్, గోగుల మల్లికార్జున, నారాయణ, చంద్ర, పయాజ్, గిరి, మదార్ ,జగదీష్ మరియు ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబటి రాంబాబుపై భౌతిక దాడి దారుణం

వేంపల్లె:ఫిబ్రవరి 01(ప్రభాత వార్త)



మాజీ మంత్రి, కాపునేత అంబటి రాంబాబుపై భౌతిక దాడి దారుణమని రాయల్ కాపునాడు రాష్ట్ర యువజన అధ్యక్షుడు కావలి క్రిష్ణతేజ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక రోడ్డు భవనాల అతిథి గృహం ప్రాంగణంలో కాపు, బలిజ నేతలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏపి సిఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై అంబటి నివాస, కార్యలయంపై భౌతిక దాడులకు దిగడం సమంజసం కాదన్నారు. తమ కాపునేతలు రాజకీయ ఎదుగుదల క్రమంలో ప్రభుత్వాల తీరు అసహనాన్ని వ్యక్త పరుస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత అధికారంలో ఉన్న ప్రభుత్వం కాపు, బలిజ సామాజిక వర్గంతో ఏర్పడిందని చెప్పుకోచ్చే క్రమంలో ఈవిధమైన కాపునేతలపై దాడులు అమానుషమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షులు నంబూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షులు కొత్తూరు రెడ్డయ్య, మునేష్, నాయకులు కొత్తూరు జగన్, సిద్దారెడ్డి, అంజీ, మోహన్ పవర్, శ్రావణ్, లోకేష్, బాలాజీ, అన్నయ్య, సుధాకర్, గోపి, ప్రశాంత్, సుకర్ణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల వార్షికోత్సవానికి మంత్రి రాక

వేంపల్లె:ఫిబ్రవరి 01(ప్రభాత వార్త)

వేంపల్లెలోని నారాయణ ఎడ్యుకేషనల్ విద్యాసంస్థలో సోమవారం చేపట్టే 12వ వార్షికోత్స వానికి రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హజరు అవుతున్నట్లు నారాయణ విద్యాసంస్థల కరస్పాండెంట్ కొట్టి నారాయణ రెడ్డి తెలిపారు. వార్షికోత్స వం సందర్భంగా అంగరంగ వైభవంగా విద్యార్థులతో సంస్కృతిక కార్యక్రమాలు కూడ చేపట్టినట్లు చెప్పారు. వార్షికోత్స వానికి విద్యార్థుల తల్లిదండ్రులు కూడ హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలోపాఠశాలడైరెక్టర్ కొటిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు సుదర్శన్, యాస్మిన్,పాల్గొన్నారు.

## అంబాటి రాంబాబు దిష్టిబొమ్మ దగ్ధం.

కురబలకోట ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



సీఎం, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును దుర్భాషలాడిన అంబాటి రాంబాబు దిష్టిబొమ్మను కురబాలకోట మండలం ముదివేడు నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ సురేంద్ర యాదవ్, రుద్ర బాలకృష్ణ, అయుబ్ భాషాలు టిటిడిలో కల్తీ నీ వ్యవహారం బయటపడడంతో దాని కప్పిపుచ్చుకునేందుకు వైసిపి నేతలు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో హద్దులు దాటిన వ్యాఖ్యలు సరికాదని ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం తగదన్నారు. నాలుగు పర్యాయాలు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన చంద్రబాబు నాయుడు ఎప్పుడు సంస్కారం గౌరవంగా పాటించాలని వారు తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు పై నారా చంద్రబాబు నాయుడు పై సోషల్ మీడియాలో అభ్యంతర వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకున్న ఘనత కూడా చంద్రబాబు నాయుడు దే నాని చేశారు. ఏపీ ప్రజలు ఇట్టి పరిస్థితుల్లోనూ సహించరని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి ,దామోదర్, రెడ్డి నజీబ్ ,ప్రభాకర, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దృష్టి మరల్చేందుకే వైకాపా నేతలపై దాడులు..

ఖాజీపేట, ఫిబ్రవరి 01, ప్రభాతవార్త:



నిన్న వైకాపా నేత అంబటి రాంబాబు నేడు జోగి రమేష్ ల పైన, వారి ఇళ్ల పైన దాడులు అప్రజాస్వామికం అని రావులపల్లి సర్పంచ్, ఖాజీపేట సర్పంచుల సంఘం అధ్యక్షులు వైకాపా నేత పైడేల శివరామిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ తెదేపా వారు తిరుమల లడ్డు పవిత్రతను దెబ్బతినేల దారుణమైన అబాండాలు వేస్తూ వస్తున్నారని, సిట్ దర్యాప్తు అనంతరం లడ్డు లో ఎలాంటి కల్తీ జరగలేదని నివేదిక ఇచ్చిన తర్వాత ప్రజల్లో వైకాపా పైన వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక తిరుమల లడ్డు పైన మరోమారు దారుణమైన అబాండాలు వేస్తూ విజయవాడలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. దానిని ఖండించిన పాపానికి అంబటి రాంబాబు పైన దాడులు చేయడం, ఇంటిపైకి వెళ్లి భయానక వాతావరణం సృష్టించి ఇంటిని తగలబెట్టడం తీవ్రంగా పరిగణించాల్సి న అంశమని మద్దతుగా నిలచిన వైకాపా నేత జోగి రమేష్ ఇంటిపైన పెట్రోల్ బాంబులతో దాడులు చేయడం దారుణం అని అన్నారు. ఏదైనా ప్రజాస్వామికంగా చట్టబద్ధంగా ఎదుర్కోవాలని ఇలా చట్టాన్ని చేతిలోకి తీసుకోవటం గతితప్పిన శాంతి భద్రతలకు తార్కాణమన్నారు. తిరుమల లడ్డూ అంశాన్ని, రాసలీలల ఎమ్మెల్యేగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కూటమి ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ అంశాల్ని దారి మళ్లించడానికి వాళ్ళు చేసిన తప్పుల్ని ప్రజల దృష్టి నుంచి తప్పించుకునేందుకు తెదేపా ఆడుతున్న నాటకాలు సృష్టిస్తున్న గొడవలు అని ప్రజలందరికీ అర్థమవుతుందనీ ఆయన అన్నారు. ప్రజలు ప్రతి విషయాన్ని సునిశితంగా గమనిస్తున్నారని మీరెన్ని డ్రామాలు వేసినా వాటిని గమనిస్తున్న ప్రజలు సరైన సమయంలో మీకు బుద్ధి చెబుతారనీ అన్నారు.

## ఐదు మంది పేకాటరాయుల్లు అరెస్టు

రాజుపాళెం, ఫిబ్రవరి 01, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలోని పెద్ద కుంట సమీపంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదు మందిని ఎస్ఐ ప్రణయ్ కుమార్ రెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. కొర్రపాడు గ్రామం నుండి అరకటవేముల వెళ్ళు రహదారిలో పెద్ద కుంట సమీపంలో పేకాట ఆడుతున్న శిబిరంపై ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేసి ఐదు మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ. 23420 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యల తగదు

పులివెందుల, ఫిబ్రవరి 1, ప్రభాత వార్త :

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిపై అక్రమ, అనుచిత మరియు అవమానకర వ్యాఖ్యలు చేసినందుకు మాజీ మంత్రి అంబటి రాంబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పులివెందుల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు నమోదైంది. పులివెందులకు చెందిన న్యాయశాస్త్ర విద్యార్థి మండం భాస్కర్ నాథ్ ఆదివారం అర్బన్ సీఐ సీతారామిరెడ్డికి ఫిర్యాదు సమర్పించారు. ఈ సందర్భంగా సిఐ తో వారు మాట్లాడుతూ ఇటీవల మీడియా, ప్రజా వేదికలు మరియు సోషల్ మీడియా ద్వారా మాజీ మంత్రి అంబటి రాంబాబు ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరంగా, అవమానకరంగా ఉన్నాయని ఈ వ్యాఖ్యలు ఒక రాజ్యాంగబద్ధమైన పదవిని అవమానించే విధంగా ఉండటమే కాకుండా, ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే అవకాశముందని, రాజకీయ మరియు సామాజిక విద్వేషాలను ప్రోత్సహించే స్వభావం కలిగి ఉన్నాయని ఫిర్యాదుదారు వివరించారు. న్యాయశాస్త్ర విద్యార్థిగా చట్టపాలనపై నమ్మకంతో ఈ ఫిర్యాదు చేస్తున్నానని, పదవిలో ఉన్నా లేదా గతంలో ఉన్నా చట్టానికి ఎవరూ అతీతులు కారని ఫిర్యాదులో స్పష్టం చేశారు. ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, వర్తించే చట్టాల ప్రకారం తగిన న్యాయ చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.దర్యాప్తుకు అవసరమైన అన్ని వివరాలు అందించేందుకు తాను పూర్తిస్థాయిలో సహకరిస్తానని కూడా ఫిర్యాదుదారు తెలిపారు.

## ముఖ్యమంత్రికి బహిరంగ క్షమాపణ చెప్పాలి

ఖాజీపేట, ఫిబ్రవరి 01, ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి చంద్రబాబు మాతృమూర్తి పై వైసిపి నేత అంబటి రాంబాబు చేసిన అనుచిత, అసభ్య వాక్యాలను టిడిపి జిల్లా కార్యదర్శి పల్లె గంగాధర్ ఖండించారు. గతంలో మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన వ్యక్తి స్థాయిని పూర్తిగా మరిచి సభ్య సమాజం తలదించుకునేలా రాష్ట్ర ముఖ్యమంత్రిని బూతులు తిట్టడం అత్యంత బాధాకరం అన్నారు. వైకాపా నేతలు అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పిదాలు, అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలపై మాట్లాడే ధైర్యం లేక దృష్టి మళ్లించేందుకే ఇలాంటి నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని నీచ రాజకీయాలు చేసే వారికి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. అంబటి రాంబాబు తక్షణమే తన వాక్యాలను ఉపసంహరించుకొని చంద్రబాబుకి, రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## అంబటి రాంబాబు దిష్టిబొమ్మ దగ్ధం

సంబేపల్లి ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వాక్యాలు చేసిన వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఆదివారం సంబేపల్లి మండల కేంద్రంలో బీసీ పాలఏ కిరి రాష్ట్ర బిసి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర్ నాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులు అంబటి రాంబాబుకు పాడెకట్టి ఆయన దిష్టిబొమ్మను ఎన్టీఆర్ సర్కిల్ వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిపై చేసిన అసభ్య వాక్యాలు రాష్ట్ర రాజకీయాలను దిగజార్చే స్థాయిలో ఉన్నాయని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడుకి లోకేష్ బాబుకి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మట్లి శ్రీనివాస్ నాయుడు టిడిపి మండల నాయకులు నారా ప్రభాకర్ నాయుడు గజేంద్రనాయుడు మట్లి వేణుగోపాల్ నాయుడు రాజంపేట తెలుగు యువత నాయకులు పొత్తూరి అశోక్ చౌదరి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిపంపై అనుచిత వాక్యలు అంబటి పై పిర్యాదు

సుండుపల్లి,ఫిబ్రవరి 01,ప్రభాతవార్త :



మండల పరిధిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు మండల అధ్యక్షులు చప్పిడి రమేష్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి మహేష్ నాయుడు టిడిపి నాయకులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసిపి నాయకుడు అంబటి రాంబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేసి అంబటి రాంబాబు పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్ఐ హుస్సేన్ కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రాజు, ప్రధాన కార్యదర్శి యూసుఫ్, గ్రామ అధ్యక్షులు సుబ్బరామయ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు 135 టన్నుల యూరియా పంపిణీ

దువ్వూరు, ఫిబ్రవరి 01, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఇడమడక, జిల్లెల్ల, చిన్నసింగన పల్లె, చింతకుంట, మీర్జాఖాన్ పల్లె, అన్నపుసాత్రపల్లె, దువ్వూరు2, ఎర్రబల్లె, పెద్ద జొన్నవరం, నీలాపురం రైతు సేవా కేంద్రాల్లో సోమవారం 135 టన్నుల యూరియాను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి తెలిపారు. ఈ 10 రైతుసేవా కేంద్రాల్లో ఒక్కొక్క చోట 300 బస్తాల చొప్పున మొత్తం 3 వేల బస్తాలను ఒకటే రోజు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రబి సీజన్లో పంటల సాగు పెరిగినందున రైతుల డిమాండ్ కు అనుగుణంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ దువ్వూరు మండలానికి 135 టన్నుల యూరియా కేటాయించిందని దానిని సోమవారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆ రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులు పట్టాదారు పాస్ పుస్తకాన్ని తీసుకొని వచ్చి ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు కొనుగోలు చేసి తీసుకువెళ్లాలన్నారు. గత వారం పంపిణీ చేసిన వారికి ఈ దఫా యూరియా ఇవ్వడం లేదని తెలిపారు. రైతులు ప్రశాంతంగా ఉండి యూరియాను కొనుగోలు చేసుకొని తీసుకువెళ్లాలని సూచించారు.

## గ్రూప్టు ఎంపికైన ఉపాధ్యాయుడు బి.వి రమణయ్య

లక్కిరెడ్డిపల్లి: ఫిబ్రవరి 01 ప్రభాత వార్త



ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్రూప్ 2 ఫలితాలలో కడప చిన్న చౌక్ లోని శ్రీరామ్ నగర్ కు చెందిన బి వి రమణయ్య అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (జీఏడి)గా ఎంపిక కావడం జరిగినది. ఈయన ప్రస్తుతం సిద్ధవటం మండలంలోని మంగళవాండ్ల పల్లెలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేయుచున్నారు. భార్య లక్ష్మీకళ పిల్లలు అఖిల్ భరద్వాజ్, అనూహ్య భాను కుటుంబ సభ్యుల సహకారంతో విజయం సాధించడం జరిగినది. బివి రమణయ్యకు లక్కిరెడ్డి పల్లెలోని మాజీ మండల ఉపాధ్యక్షులు వీరబల్లి వెంకటరమణ నివాస గృహంలో సన్మాన కార్యక్రమం కుటుంబ సభ్యులతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వి వి కే రాఘవేంద్రరావు, మాలతి ఇందిరమ్మ ఎస్ మనోహర్, ఎల్. వి రమణ,ఇస్మాయిల్ అఖిల్ భరద్వాజ్ దిలీప్ అనూహ్య భాను దీక్షి త పాల్గొన్నారు.

## సురేంద్రబాబుకి డాక్టర్ ప్రధానం

పీలేరు ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



స్థానిక పీలేరు పట్టణంలో వెలిసిన శ్రీ సాయి బాబా హై స్కూల్ కరస్పాండెంట్ సురేంద్ర బాబుకి గౌరవ డాక్టరేట్ చెన్నై జీవ జియోసిటికల్ ఓపెనింగ్ వర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసినది దీనికి అభినందించడానికి ఎమ్మెల్సీ రామచంద్ర రెడ్డి అపుస్మ ప్రెసిడెంట్ రామచంద్ర రెడ్డి మరియు స్థానిక సంస్థల కరస్పాండెంట్లు జిల్లా నలుమూలల నుంచి కరస్పాండెంట్లు జిల్లా నల్గొండ నుంచి అపుష్మ కుటుంబ సభ్యులైనటువంటి అందరూ ఇచ్చేసి సురేంద్రబాబును సన్మానించారు గత 30 సంవత్సరములుగా పాఠశాల నడుపుతూ ఎన్నో రకమైనటువంటి హితోబిక సేవ కార్యక్రమంలో చేపట్టిన దాని ఎంతోమంది విద్యార్థులు తీర్చిదిద్దగాను ఈ గౌరవ డాక్టర్ దక్కినది అభినందించారు. ఈ కార్యక్రమంలో సురేంద్రబాబు అభిమానులు విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ విషసంస్కృతికి అంబటి వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి

### అంబటిపై ధ్వజమెత్తిన సూర్యనారాయణ రెడ్డి

బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 1, ప్రభాత వార్త



వైసీపీ నేత అంబటి రాంబాబు మాట్లాడే భాష వారి పార్టీ రాజకీయ సంస్కృతిని ప్రతిబింబిస్తోందని, కడప డిసిసిబి చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి విమర్శించారు. ప్రజలు ఇప్పటికే తీర్పు ఇచ్చి ఇంటికి పంపినా ఆయన తీరులో మార్పు లేదన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. మంత్రిగా ఉన్న సమయంలో అంబటి ఏం సాధించారో రాష్ట్ర ప్రజలంతా చూశారని, నీచమైన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరిస్తూ, రాజకీయాల్లో హుందాతనం నేర్చుకోవాలన్నారు.

## అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం

బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త



ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ మాజీ మంత్రి అంబటి చేసిన వ్యాఖ్యలు బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మండల క్లస్టర్ ఇంచార్జ్ బిజివేముల రామచంద్రారెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్యంలో పదవులకు, వ్యక్తులకు గౌరవం కాపాడటం ప్రతి రాజకీయ నాయకుడి బాధ్యత అని, ప్రజల విశ్వాసంతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. రాజకీయ విమర్శలు ఒకటైతే, వ్యక్తిగత దూషణలు మరొకటని, వైసీపీ నాయకులు తమ పాలనలోని వైఫల్యాలను దాచిపెట్టేందుకే ఇటువంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అయితే ప్రజలు ఇప్పటికే వారి తీరును గమనిస్తున్నారని, తగిన సమయంలో తగిన తీర్పు ఇస్తారని ఆయన తెలిపారు. అంబటి రాంబాబు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## అంబటి రాంబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలి

బద్వేల్ అర్బన్ , ఫిబ్రవరి 1, ప్రభాతవార్త



ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి ఖండించారు. గతంలో మంత్రిగా పనిచేసిన వ్యక్తి తన స్థాయిని మరిచి ముఖ్యమంత్రిపై అసభ్య వ్యాఖ్యలు చేయడం సభ్య సమాజం తలదించుకునే విషయమన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విభేదాలు సహజమే అయినా, వ్యక్తిగత దూషణలకు దిగడం రాజకీయ సంస్కృతికి మచ్చగా మారుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రిపై దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. వైసీపీ నేతలు తమ పాలనలో చేసిన తప్పిదాలు, అవినీతిపై మాట్లాడలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, నీచ రాజకీయాలు చేసే వారికి తగిన సమయంలో తగిన గుణపాఠం చెబుతారన్నారు. అంబటి రాంబాబు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని ముఖ్యమంత్రికి, రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## బలిజ కులస్తుల కోసమే ఉచిత వివాహ పరిచయ వేదిక

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



బలిజ యువతీ యువకులకు బలిజ కులస్తులకు సులభంగా వివాహం జరగడం కోసమే జీవిఆర్ ఉచిత వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేసినట్లు వేదిక వ్యవస్థాపకుడు రిటైర్డ్ ఇంజనీర్ జి. వి. రమణ తెలిపారు. ఆదివారం స్థానిక కెఎస్సార్ అండ్ సిఆర్సీ బలిజ సంఘం కళ్యాణ మండపం నందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేదిక వ్యవస్థాపకుడు జి. వి. రమణ మాట్లాడుతూ ఎటువంటి కమీషన్లు లేకుండా ఉచిత మధ్యవర్తిత్వంతో తల్లిదండ్రుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం జీవిఆర్ ఉచిత బలిజ వివాహ పరిచయ వేదిక నియోజకవర్గ అధ్యక్షుడు అల్లం చంద్రశేఖర్ మాట్లాడుతూ దాదాపు 45 వివాహ పరిచయ వేదికలు నేటివరకు నిర్వహించామని, ప్రొద్దుటూరులో ఇది రెండవదని వివరించారు. ఈ కార్యక్రమంలో వేదిక సభ్యులు ఆకుల చంద్రశేఖర్, శివ గోపాల్, సాంబయ్య, గుర్రప్ప, స్టూడియో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సత్తార్ సాబ్

తంబళ్లపల్లె ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :



మండలంలోని ఎద్దుల వారి పల్లి పంచాయతీ వైకాపా గ్రామ కమిటీ అధ్యక్షుడుగా షేక్ సత్తార్ సాబ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల వైకాపా అధ్యక్షుడు రేపన చౌడేశ్వర ఆధ్వర్యంలో జరిగిన పార్టీ కమిటీ ఎన్నికల రచ్చబండ కార్యక్రమంలో అబ్జర్వర్ ఉమాపతిరెడ్డి గ్రామ కమిటీ అధ్యక్ష పదవి ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు సత్తార్ సాబ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనకు పదవి దక్కడంపై ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, వైకాపా నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ పంచాయతీలో వైకాపా బలోపేతానికి కృషి చేస్తానని సత్తార్ సాబ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్యామల కోటిరెడ్డి, ఎంపీటీసీలు హరిత కరిముల్లా, మహేష్, సర్పంచ్ రెడ్డినారాయణ, అమర్నాథ్ రెడ్డి, శ్రీరాములు, చలపతి నాయుడు, శంకర, రామస్వామి, శివ ప్రసాద్, వెంకటేష్, నాగార్జున, ఫయాజ్, మహేష్, గోవర్ధన్ రెడ్డి, అన్వర్ భాష, ఖాజాపీర్, గిరి, ఎరుకల రెడ్డి, మధుకర్, మద్దిరెడ్డి, మనోజ్ కుమార్ రెడ్డి, శ్రీరాములు, నరసింహారెడ్డి, వెంకటరమణా రెడ్డి, వేమారెడ్డి, రాఘవరెడ్డి, రమణ, మధు, మణి, అమీన్ పీర్ వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి కల్పన దిశగా కేంద్ర బడ్జెట్

సిద్ధవటం ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026 27 ఆర్థిక సం, ఆదివారంలో కసభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఉపాధి కల్పన దిశగా ప్రవేశ పెట్టారని సిద్ధవటం మండల బిజెపి అధ్యక్షులు సుబ్రమణ్యం తెలిపారు మండల కేంద్రమైన సిద్ధవటంలో ఆయన ఆదివారం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో లోకసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉపాధి కల్పన దిశగా ఉందని ఆయుష్ రంగంలోని ఆయుర్వేద హాస్పిటల్ ఏర్పాటు, వైద్య రంగంలో మౌలిక సదుపాయాల కోసం బడ్జెట్ కేటాయింపు బయో ఫార్మా రంగానికి 10, వేల కోట్లు కేటాయించడం పట్ల నిరుపేదలకు ఎంతో ఊరటగా ఉంటుందని మూలధన వ్యయం 12, 20 లక్షల కోట్లు లోకసభలో మంత్రి ప్రవేశపెట్టి పలు శాఖలకు బడ్జెట్ కేటాయింపు చేశారని రాష్ట్రంలో కొత్తగా రైల్వేలైన్లు ఏర్పాటుకు పలు హైవేరోడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని అభివృద్ధి సంక్షేమాలు కేంద్రం, మరియు రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని మండల బిజెపి అధ్యక్షులు సుబ్రమణ్యం తెలిపారు ఈ కార్యక్ర మంలో బిజెపి సీనియర్‌నేత కాకర్ల భాస్కర్‌రెడ్డి, పార్ల బాలసుబ్బయ్య, దొరబాబు, అరవిందు కుమార్, కాశి, తదితర బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.



మోడల్ స్కూల్ బద్వేల్ పనిచేస్తున్న సోమేశుల అన్నపూర్ణమ్మ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో బద్వేల్ రీజియన్ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు

## రెడ్డి అనుబంధ మహోత్సవం విజయవంతం

పీలేరు ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



భక్త మల్లారెడ్డి ఫౌండేషన్ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్.పి.ఆర్. కన్వెన్షన్ హాల్‌లో 'రెడ్డి అనుబంధ మహోత్సవం' వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిమంది రెడ్డి కులస్తులు హాజరై విజయవంతం చేశారు. ఈ మహోత్సవంలో భాగంగా కలికిరి రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు పులి సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పీలేరు నియోజకవర్గం నుంచి వందలాది మంది రెడ్డి కులస్తులు పాల్గొన్నారు. మహోత్సవంలో పాల్గొన్న అనంతరం కలికిరికి తిరిగి వచ్చిన రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు పులి సత్యనారాయణ రెడ్డి స్థానిక మీడియాతో మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన 'రెడ్డి కుల చరిత్ర' ప్రదర్శన అత్యంత ఆకట్టుకునేలా ఉందని ప్రశంసించారు. రెడ్డి కులస్తులతో పాటు రెడ్డి కుల అభిమానులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఎంతో ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు అమర్నాథ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, డీలర్ సత్యనారాయణ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, గిరి, శ్రీరాముల్ రెడ్డి, జనార్ధన రెడ్డి, జయరాం రెడ్డి, ప్రసాద్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, అలాగే వాల్మీకిపురం మండల టిడిపి అధ్యక్షులు దామోదర్ రెడ్డి, శేషాద్రి రెడ్డి, కేవీ రెడ్డి, ద్వారకనాథ రెడ్డి, శ్రీనివాసు రెడ్డి, కృష్ణా రెడ్డి, శేష కుమార్ రెడ్డి, రామి రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, రెడ్డప్ప రెడ్డి, టీచర్ రామకృష్ణ రెడ్డి, తుమ్మలపేట భాస్కర్ రెడ్డి, చాపల రాజా రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, ఎం.ప్రభాకర్ రెడ్డి, పాల్గొన్నట్లు తెలిపారు.

## శీతల గంగమ్మకు ప్రత్యేక పూజలు

సిద్ధవటం ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



శీతల గంగమ్మ అమ్మవారికి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు రంగమ్మ తీర్థ ప్రసాదాలు అందించారు మండలంలోని మాధవరం,1 పార్వతీపురం గ్రామంలో వెలిసిన శీతల గంగమ్మ అమ్మవారికి మాఘ, పౌర్ణమి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మన ఊరు స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ వేకువ జాము నుండి మాఘ పౌర్ణమి సందర్భంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ ప్రతినిధి దేరంగుల శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రాంతవాసులు పాల్గొన్నారు.

## ఆపస్ కార్యాలయం ప్రారంభోత్సవం

పీలేరు ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



ఆపస్ కార్యాలయం ప్రారంభిస్తున్న దృశ్యం

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం పీలేరు డివిజన్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కోటపల్లి సర్కిల్లో వద్ద ఆపస్ కార్యాలయం ప్రారంభోత్సవం డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ లోకేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నరసింహులు మరియు జిల్లా సహాధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ ఈ కార్యాలయం కేంద్రంగా పీలేరుచుట్టుపక్కల ఉన్న ఉపాధ్యాయులందరికీ ఆన్లైన్ సేవా కార్యక్రమాలు మరియు ఉపాధ్యాయుల వ్యక్తిగత సర్వీస్ పరమైన అంశాలన్నీ పరిష్కరించేందుకోసం పనిచేస్తుందని తెలియజేశారు. కావున ఉపాధ్యాయులు అందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా డీసీబీ సెక్రటరీ గంగాధర్ కేవీ పల్లి మండల విద్యాశాఖ అధికారి రెడ్డి భాష మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అవసరమైన సేవా కార్యక్రమాలు కార్యాలయం కేంద్రంగా నిర్వహించడం ప్రశంసించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శివశంకర్ జిల్లా కార్యదర్శి బాలాజీ, పీలేరు డివిజన్ అధ్యక్షులు అమర్నాథ్ వివిధ మండలాల అధ్యక్షులు కార్యదర్శులు ఓబుల్‌రెడ్డి, వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లిని, మాధవరాయున్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

మైదుకూరు, ఫిబ్రవరి 01, ప్రభాతవార్త:



శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి 27వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికిన పండితులు పెద్దమ్మతల్లి వార్షికోత్సవ నిర్వాహకులు. అనంతరం ఆయనకు అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువా పూలమాలతో సత్కరించారు. మైదుకూరు పట్టణం పాతూరు గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి 27వ వార్షికోత్సవంలో భాగంగా అంగరంగ వైభవంగా జరుగుతున్నా ఈ వేడుకలు తొమ్మిది రోజులపాటు పెద్దమ్మతల్లి వార్షికోత్సవ వేడుకలు జరగనున్నాయి. కార్యక్రమంలో నాలుగో రోజు శ్యామలాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగింది. అనంతరం మైదుకూరు ప్రసిద్ధ చెందిన దేవాలయం శ్రీ లక్ష్మీ మాధవరాయ స్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని సందర్శించి దేవస్థానం చైర్మన్ బండి బెల్లం సుబ్బరాయుడు ఆహ్వానంతో మాధవరాయ స్వామివారిని దర్శించుకున్న శాసనసభ్యులు సుధాకర్ యాదవ్ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చన, అభిషేకం చేసి ఆశీర్వాదం అందించిన పూజారులు స్వామివారిని భక్తితో కుటుంబం, నియోజకవర్గం ప్రజలు ,రైతులు సుఖశాంతులతో ఉండాలని పెద్దమ్మతల్లి, మాధవరాయ స్వాములను కోరుకున్న ఎమ్మెల్యే ఆయన వెంట పాల్గొన్న నియోజకవర్గం టిడిపి నేతలు,మండల నాయకులు, పట్టణ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంబటి క్షమాపణ చెప్పాలి

పులివెందుల, ఫిబ్రవరి 1 , ప్రభాతవార్త :



ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచితమైన, అసభ్య వ్యాఖ్యలు చేసిన వైఎస్‌ఆర్సీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పట్టణంలోని అహోబిలాపురం మెయిన్ స్కూల్ సమీపంలోని గాంధీ సర్కిల్ నందు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అంబటి రాంబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా తూగుట్ల మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, వ్యక్తిగత దూషణలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, మగ్గం ప్రసాద్, సుబ్బారెడ్డి, హరినాథ్ రెడ్డి, అంకుల్ రెడ్డి, బాబా, ఫక్రుద్దీన్, రియాజ్, మనోహర్, వల్లెం షయం, వల్లెపు శివరాం, ఫయాజ్, గణేష్, దేవకుమార్, గండి సుబ్బరాయుడు, చంటి, రాజ్ కుమార్, ఏబు ప్రశాంత్, అక్రమ్, మంజుల, సీను తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిసివై యూత్ రాష్ట్ర కోకన్వీనర్‌గా ప్రేమ్ కుమార్

పుంగనూరు ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



న్యాయవాది పూల ప్రేమ్ కుమార్‌కు భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర యువజన విభాగం కో కన్వీనర్‌గా నియమితులయ్యారు. బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. పార్టీ పట్ల అంకితభావం పరిగణలోకి తీసుకొని ఈ పదవిని కేటాయించారు.పూల ప్రేమ్ కుమార్ పుంగనూరులో న్యాయవాదిగా ఉన్నారు.

## జైల్ సింగ్ భౌతికకాయానికి నివాళులు

చిన్నమండెం పిబ్రవరి 1 ప్రభాతవార్త:



చిన్నమండెం టౌన్‌లో నివాసముండే టీడీపీ సీనియర్ కార్యకర్త జైల్ సింగ్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని ఆదివారం ఆయన భౌతిక కాయానికి టీడీపీ రాజంపేట పార్లమెంట్ నియోజక వర్గ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు, చిన్నమండెం మండల టీడీపీ అధ్యక్షుడు ముగి రెడ్డెప్ప ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిసివై నియోజకవర్గ కన్వీనర్‌గా హరిబాబుయాదవ్

చౌడేపల్లి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



భారత చైతన్య యువజనపార్టీ(బిసివై) పుంగనూరు నియోజకవర్గ కన్వీనర్‌గా యొద్దుల హరిబాబుయాదవ్ నియమితులయ్యారు. మండలంలోని పంచాయతీ కేంద్రం 29ఎ.చింతమాకులపల్లికి చెందిన హరిబాబుయాదవ్ తొలి నుంచి బిసివై వ్యవస్థాపక అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ విధేయుడుగా వున్నాడు. అదే విధంగా సామాజిక స్పృహతోపాటు ఉద్యమ నేతగా పేరునుగడించారు. ఆయన కున్న పట్టుదల, ప్రజా సమస్యల పట్ల పోరాట పటిమను గుర్తించిన బిసివై నేత బోడె రామచంద్రయాదవ్ నియోజకవర్గ కన్వీనర్‌గా యొద్దులను నియమించారు. తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతను అప్పగించినందుకు అధిష్టానానికి, రామచంద్రయాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి అభివృద్ధికి కృషి చేస్తానని హరిబాబు యాదవ్ అన్నారు.

## ద్విచక్రవాహనం దొంగతనం యత్నం

చౌడేపల్లి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

మైనర్ బాలుడు ద్విచక్రవాహనాన్ని దొంగలించబోయి గ్రామస్తులకు పట్టుబడ్డాడు. అతన్ని దేహశుద్ది చేసి పోలీసులకు అప్పగించారు. మండలంలోని పంచాయతీ కేంద్రం చారాలకు చెందిన సుబ్రమణ్యం ఇంటి ముందు స్కూటర్ వుంది. దాన్ని గుర్తించిన ముగ్గురు యువకులు(మైనర్‌తోసహా) దొంగలించ తలచారు. ఆదివారం తెల్లవారు జామున ఇంటి ముందు నుంచి స్కూటర్‌ను తీసుకురావాలని మైనర్ బాలుడుకి ఇద్దరు వ్యక్తులు చెప్పి ప్రధానరహదారిలో కాపు కాస్తారు. బాలుడు స్కూటర్‌ను తీసుకొస్తుండగా స్థానికులు గుర్తించి అతన్ని పట్టుకొన్నారు. అక్కడే ఒక స్తంభానికి కట్టేసి దేహశుద్ది చేసారు. అప్పటికే ఇద్దరు వ్యక్తులు పారిపోయారు. పట్టుబడ్డ బాలుడు సదుం మండలం యర్రాతివారిపల్లి శివ(15)గా గుర్తించి పోలీసులకు అప్పగించినట్లు గ్రామస్తులు తెలిపారు.

## అంబటి రాంబాబు వ్యాఖ్యలు బాధాకరం

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలు బాధాకరమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వైఎంఆర్ కాలనీలోని ఆయన నివాసంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో వైసీపీ అధికారంలో వున్న సమయంలో శాసన సభలో వైసీపీ మంత్రులు చంద్రబాబు, టిడిపి నాయకులపైన జిగుప్సాకర వ్యాఖ్యలు చేయడంతో పాటు రాజకీయాలకు ఏ మాత్రం సంబంధం లేని చంద్రబాబు తల్లిదండ్రులు, సతీమణిపై కూడా దూషణ చేస్తున్నారన్నారు. అసలు వెంకటేశ్వర స్వామి వారి పేరు ఎత్తే అర్హత వైసీపీ వారికి లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్ల మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలు బాధాకరమన్నారు. అసలు వారి ప్రవర్తన వలన 11 సీట్లకు పడిపోయిన ఇంకా వారికి బుద్ధి రావడం లేదని, ప్రజలే వారికి తగిన గుణపాఠం తెలపాలన్నారు.

## చెరువులు ఆక్రమిస్తే కఠిన చర్యలు

పుంగనూరు రూరల్ ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



నియోజకవర్గంలో ఏ గ్రామంలో ఎక్కడైనా చెరువులు ఆక్రమిస్తే కఠిన చర్యలకు సిద్ధపడతామని తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా బాబు హెచ్చరించారు. పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్ట దురాక్రమణలకు గురవుతున్న నేపథ్యంలో ఆయన ఆదివారం చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఎక్కడైనా చెరువు కట్టలు దురాక్రమణలకు గురయ్యే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. ఎలాంటి ఆక్రమణలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పుంగమ్మ చెరువు అభివృద్ధి పేరిట కోట్ల రూపాయలు వెచ్చించామని చెప్పి ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుంగనూరు పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు ఏడాది కాలంలోనే హంద్రీనీవా జలాల ద్వారా పుంగనూరుకు నీరు అందించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రాము, ఆర్ఐ పనికుమార్, సర్వేయర్ శ్రీనివాసులు నాయక్, ఏఎంసీ చైర్మన్ సమీపతి యాదవ్, విశ్రాంత డీఎస్పీ, తెలుగుదేశం నాయకులు సుకుమార్ బాబు, మాధవరెడ్డి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పాలకుంట శ్రీనివాసులకు ఘన సన్మానం

పీలేరు ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



పాలకుంట శ్రీనివాసులు సన్మానిస్తున్న దృశ్యం

రాష్ట్ర జిల్లాల విజిలెన్స్ మానిటరింగ్ కమిటి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన పాలకుంట శ్రీనివాసులకు స్థానిక పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటి సమావేశపు మందిరంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ కలకడ మండలం కోనపంచాయితీ నందు మారుమూల గ్రామంలో జన్మించి విద్యార్థి దశ నుంచే ఉద్యమాలపై పట్టు సాధిస్తు జిల్లా స్థాయిలో సమస్యలపై తనదైన శైలిలో కృషి చేయడంతో కార్యవర్గ సమావేశంలో ఆయనను రాష్ట్ర అధ్యక్షులుగా పదవి పొందడంతో రాష్ట్రస్థాయిలో, జిల్లా స్థాయిలో, బహుజన వర్గాల అభివృద్ధికి తోడ్పాటుకు వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మహేష్ యాదవ్, మేము సైతం ఫౌండేషన్ వ్యవస్థాపకులు షాహిన్ షా, ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు గండికోట వెంకటేష్, మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణి కుమార్, మాదిగ దల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ముల్లంగి చంద్రయ్య, రాష్ట్ర గిరిజన సమైక్య జిల్లా కన్వీనర్ జిల్లా విజయ్ కుమార్, ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ వి గురునాథం, మైనార్టీ నాయకులు హబీబ్, చంద్రయ్య పాల్గొన్నారు.

## అంబటి వ్యాఖ్యలు వైఎస్సార్సీపీ నీచ సంస్కృతికి నిదర్శనం

మదనపల్లి క్రైమ్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త.



ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలు వైసిపి నీచ సంస్కృతికి నిదర్శనమని జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్ విమర్శించారు. ఆదివారం మహేష్ విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇటువంటి బూతు పురాణాల వల్లే ప్రజలు విసిగిపోయి వైఎస్సార్సీపీని 11 సీట్లకే పరిమితం చేశారని, అయినా ఆ పార్టీ నాయకుల తీరు మారలేదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్న అంబటి రాంబాబుపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో కనీస భాషా విజ్ఞతతో వ్యవహరించాలని, లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు సందీప్ రెడ్డి, చిరంజీవి, రమణ రాజా, రేవంత్, జగదీష్, రతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇటుక బట్టీ కార్మికుడిపై కొడవలితో హత్యాయత్నం

మదనపల్లి క్రైమ్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త.

మండలంలోని తెట్టు గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో ఓ ఇటుక బట్టీ కార్మికుడిపై ప్రత్యర్థి కొడవలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం కురబలకోట మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లి మండలం, వలసపల్లి గంగాపురానికి చెందిన శ్రీనివాసులు (40) వృత్తిరీత్యా ఇటుక బట్టీల కార్మికుడుగా పని చేస్తున్నాడు. శ్రీనివాసులు ఆదివారం కురబలకోట మండలం తెట్టు ప్రాంతంలో ఇటుక బట్టీ పనులు చేస్తుండగా మండ్యం వారి పల్లి కి చెందిన హరి అనే వ్యక్తి ఇటుక బట్టీలు వేయకూడదంటూ ఘర్షణకు దిగాడు. మాట మాట పెరగడంతో ఆవేశానికి లోనైన హరి, తన వెంట తెచ్చుకున్న కొడవలితో శ్రీనివాసులుపై దాడి చేశాడు. ఈ దాడిలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన శ్రీనివాసులను చికిత్స నిమిత్తం మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె క్రైమ్ ఫిబ్రవరి 1 ప్రభాతవార్త.

వేరువేరు కార్యాలతో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం చేసుకుంది. బాయతుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చౌడేపల్లి మండలంలోని చిన్న కొండా మర్రి గ్రామానికి చెందిన మునీశ్వర్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతను ప్రతిరోజూ పనికి వెళ్లి సంపాదించిన కూలి డబ్బులను ఇంటికి తీసుకురాకుండా మద్యం తాగేందుకే ఖర్చు చేస్తున్నాడని భార్య సుకన్య (35) మనస్థాపంతో వాస్మోల్ పాయిజన్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అలాగే పుంగునూరు మండలంలో ని కత్తర్లపల్లి గ్రామానికి చెందిన రైతు కృష్ణప్ప (65) గత కొంతకాలంగా కుటుంబ సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి, తన పొలం వద్దకు వెళ్లి విషం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి ఆయన్ను చికిత్స నిమిత్తం మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సామాన్యుడిని, కార్మిక ఉద్యోగులను పట్టించుకోని బడ్జెట్

పీలేరు ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:

2026, 27 సంవత్సరానికి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 53, 47,315 కోట్ల రూపాయల్లో సామాన్యుడికి ఏ రకంగాను మేలు చేసేది కాదని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రామయ్య వ్యాఖ్యానించారు. బడ్జెట్ లో కార్మికుల స్కీం వర్కర్లు కేంద్ర ప్రవేశపెట్టిన క్లాత్ మిత్రులుగా గురించి వారి సమస్యల గురించి ప్రస్తావన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 12,వ తేదీన పెద్ద ఎత్తున కోట్లాదిమంది సమ్మె చేపడుతున్న నేపథ్యంలో వారి సమస్యలను బడ్జెట్లో ప్రస్తావించకపోవడం దారుణమని విమర్శించారు. కృత్రిమ మేధ కారణంగా ఎదురయ్యే నిరుద్యోగ సమస్య గురించి గానీ, దేశాన్ని వివిధ సంక్షోభ సందర్భాల్లో గట్టెక్కిస్తున్న ఉపాధి హామీ పథకం గురించి గానీ, ధరల పెరుగుదల, అవినీతి, రూపాయి విలువ పతనం, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు తదితర అంశాలు ప్రస్తావన లేకపోవడం సామాన్యుల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనంగా ఆయన అభివర్ణించారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి జనం అల్లాడిపోతుంటే వారి శక్తి పెంచడానికి తోడ్పడే చర్యలు బడ్జెట్లో లేవని అన్నారు. కాబట్టి కార్మికులు ఉద్యోగులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలకు బుద్ధి చెప్పేలా ఫిబ్రవరి 12సమ్మె జయప్రదం చేయాలని కోరారు.

## వైసీపీని బంగాళాఖాతంలో కలిపేస్తాం

### టిడిపి ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు

సిద్ధవటం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



వైసిపిని స్థానిక సంస్థల ఎన్నికల్లో బంగాళాఖాతంలో కలిపేస్తామని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు తెలిపారు. సిద్ధవటంలోని మాజీ మార్కెట్ చైర్మన్ సయ్యద్ జవహర్ భాష పార్టీ కార్యాలయంలో ఆదివారం రాత్రి నియోజకవర్గ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు మండల టిడిపి కార్యకర్తల సమావేశం తో మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలు పార్టీకి పట్టుకొమ్మలని ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఏక తాటిపై కొచ్చి వైయస్సార్ పార్టీని బంగాళాఖాతంలో కలిపేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షులు జ్యోతి జగదీశ్వర్ రెడ్డి, దూదేకుల సంక్షేమ రాష్ట్ర ఫైనాన్స్ సెక్రెటరీ, వీరభద్రుడు, సింగల్ విండో అధ్యక్షులు దశరథ నాయుడు, మాజీ మార్కెట్ చైర్మన్ సంజీవరెడ్డి, సయ్యద్ జవహర్ భాష రాష్ట్ర బీసీ సెల్ కార్య నిర్వహణ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు నిత్య పూజ కోన, పాలకమండలి చైర్మన్, రాజేంద్రప్రసాద్, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, సింగిల్ విండో డైరెక్టర్ బాలిరెడ్డి, మండల కో కన్వీనర్ శంకర్ రెడ్డి, మండల మాజీ కన్వీనర్ మామిడి సుబ్బారెడ్డి, సర్పంచ్ ప్రతినిధులు, తుర్ర ప్రతాప్ నాయుడు, వెంకటేశ్వర్లు మల్లు విజయభాస్కర్ రెడ్డి తదితర మండల టిడిపి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేకాట, గంజాయి వంటి వాటిపై అవగాహన

నిమ్మనపల్లె, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నిమ్మనపల్లె మండలంలో స్థానిక పోలీసులు ప్రజలకు పేకాట, గంజాయి వంటి మాదకద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలని ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అసాంఘీక కార్యక్రమాలు, పేకాట, గంజాయి, మద్యం, సైబర్ నేరాలు, వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటే వెంటనే మాకు సమాచారం ఇవ్వాలని, అలాంటి వాటికి ప్రతి ఒ క్కరూ ముఖ్యంగా విద్యార్థులు దూరంగా ఉండాలని తెలిపారు. అంతేకాకుండా రోడ్డు భద్రతపై ప్రతి వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సదస్సులో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కలికిరి అంబేద్కర్ విగ్రహ స్థలాన్ని కాపాడుకుందాం

పీలేరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



పీలేరు నియోజకవర్గం కలికిరి పట్టణంలో అమర్నాథ్‌రెడ్డి కాలనీ వద్ద ఉన్నటువంటి అంబేద్కర్ విగ్రహానికి సంబంధించిన స్థలాన్ని ఇప్పుడు గవర్నమెంట్ హాస్పిటల్ సూపర్డెంట్, అక్కడ దయాలసిస్ సెంటర్, ఆయుర్వేదిక్ హాస్పిటల్ కట్టాలని, జెసిబిలతో గుణాతాలు వేయడానికి గుంతలు కూడా తవ్వడం జరిగింది. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు సిపిఐ పార్టీ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేష్ ఆ స్థలాన్ని పరిశీలించడం జరిగింది సందర్భంగా టిఎల్ వెంకటేష్ మాట్లాడుతూ ఏడు సంవత్సరాల క్రితం అంబేద్కర్ విగ్రహం మెమోరియల్ ట్రస్ట్ భవనం ఏర్పాటు చేయాలని పంచాయతీ అప్రూవల్ కూడా తీసుకోవడం జరిగింది. అక్కడ స్పష్టంగా ఉత్తరాన అమర్నాథ్ రెడ్డి కాలనీ రోడ్డు, దక్షిణాన రూరల్ బ్యాంకు కాలువ, తూర్పున ఆర్అండ్‌బి రోడ్డు, పడమర, గవర్నమెంట్ హాస్పిటల్, నీ హద్దులుతో కూడిన నాటి పంచాయితీ అధ్యక్షుల సమక్షంలో అనుమతి పత్రం మంజూరు చేయడం జరిగింది. దాన్ని కూడా ఈ రోజు లెక్కచేయకుండా హాస్పిటల్ కట్టుకోవడానికి హాస్పిటల్ ఆవరణంలోనే స్థలం ఉన్న కూడా వినియోగించుకోకుండా అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉన్న స్థలాన్ని ఎంపిక చేయడం ఇంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంపైన సోమవారం పార్టీలకు అతీతంగా కలెక్టర్ వినతిపత్రం ఇవ్వడంతో పాటు, స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డికి కూడా, వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి పార్టీల అతీతంగా అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## ముమ్మరంగా వాహనాలు తనిఖీ

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:

పెండ్లిమర్రిలో ఆదివారం ముమ్మరంగా పోలీసులు వాహనాలు తనిఖీలు చేపట్టారు. రికార్డులు లేని వారికి జరిమానా విధించారు. ప్రతి వాహనానికి రికార్డులు తప్పనిసరిగా ఉండాలని రికార్డులు లేని వాటికి కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు తప్పకరించాలని వారు పేర్కొన్నారు.

# పులివెందులలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

### 614 ఓపీల నమోదు... ఎముకలు, కండరాల నొప్పులపై సమగ్ర వైద్య పరీక్షలు

**పులివెందుల, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త**

కడప కేంద్రంగా పనిచేస్తున్న విద్యాసాగర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు విద్యాసాగర్‌రెడ్డి ఆదివారం పులివెందులలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరానికి పులివెందుల పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరంలో మొత్తం 614 మంది ఓపీలు నమోదు కాగా, పెద్ద సంఖ్యలో ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి, డాక్టర్ శ్రీలక్ష్మిలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు అందించారు. ముఖ్యంగా ఎముకలకు సంబంధించిన సమస్యలు, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, మెడ నొప్పులతో బాధపడుతున్న వారికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో రోగులకు అవసరమైన ఎక్స్‌రే పరీక్షలు కూడా పూర్తిగా ఉచితంగా నిర్వహించడం విశేషం. దీర్ఘకాలంగా ఎముకలు, కండరాల నొప్పులతో ఇబ్బందిపడుతున్న రోగులను సవివరంగా పరిశీలించిన వైద్యులు, జీవనశైలి మార్పులు, వ్యాయామాలు, చికిత్సా విధానాలపై పలు సూచనలు చేశారు. అలాగే అనుభవజ్ఞులైన ఫిజియోథెర ఫిస్ట్ డాక్టర్లు వెంకట్, కే.వి. సాయి కిషోర్‌లు రోగులకు ఫిజియోథెరపీ సేవలు అందించారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. వైద్యుల సేవాభావానికి పులివెందుల ప్రజలు, పులివెందుల ఫిజియోథెరపీ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కే.వి.సాయి కిషోర్ కృతజ్ఞతలు తెలిపారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి

### స్పెల్ బి పోటీల్లో

# రాష్ట్ర ప్రథమ స్థానం సైలెస్ గౌడ

**పెద్దమండెం జనవరి 1 ప్రభాతవార్త**



స్పల్ బి పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో వెలిగిల్లు విద్యార్థి శైలేష్ గౌడ ప్రథమ స్థానంలో గెలిచారని ఎంఈఓ మనోహర్ అన్నారు అలాగే గ్రేట్ త్రి నందు రాష్ట్రంలో రెండవ స్థానంలో అనిరుద్ అవార్డులు అందుకున్నారు. పోటీల్లో వీరికి కోచింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డిని జిల్లా విద్య అధికారి సుబ్రహ్మణ్యం ఏపీసి అనురాధలో వీరిని అభినందించారు రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వీరు జాతీయస్థాయిలో ముంబైలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు రెండవ తరగతి లోనే రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో అవార్డులు అందుకుంటున్న విద్యార్థులకు మండల అధికారులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## అంబటి చేసిన వ్యాఖ్యలపై కూటమి శ్రేణులు నిరసన



చిత్రపటాలతో నిరసన తెలుపుతున్న కూటమి నాయకులు

**పీలేరు ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:**

ప్రజా సంక్షేమం అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడి పని చేస్తున్న బాధ్యత గల ముఖ్యమంత్రిపై వైసిపి నేత అంబటి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపాయి. పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి శ్రేణుల నిరసనలు, నినాదాలు పెద్ద ఎత్తున వెలువత్తాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అంబటి రాంబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఆయన దిష్టిబొమ్మని దగ్ధం చేశారు. వైసిపి నాయకులు రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు రౌడీల్లా ప్రవర్తించి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని మండిపడ్డారు. అంబటి రాంబాబుపై చట్టపరంగా చర్యలు తీసుకుని శిక్షించాలని, ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృత్తం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి బాబు రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, పురం రామ్మూర్తి, లక్ష్మీ కర, పోలిశెట్టి సురేంద్ర, వసంతల రాజా, తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వికసిత భారత్2047 లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

**వైవీయూ, ఫిబ్రవరి 01, ప్రభాతవార్త:**



ఆరంజ్ ఎకానమీకి సపోర్ట్ గా బడ్జెట్ కనిపిస్తుంది. టాక్స్ పేయర్స్ కి పెద్దగా ఊరట లభించలేదు ఎక్స్‌పెక్ట్ ఫైలింగ్ డేట్ పొడిగింపు తప్ప. యువత కోసం వైద్య రంగంలో నూతన కోర్సు అభినందనీయం. బాలికల కోసం ప్రతి జిల్లాలో ఒక హాస్పిటల్ ఏర్పాటు చేయడం మంచి డెవలప్మెంట్. ఆంధ్రప్రదేశ్ తో పాటు మరికొన్ని రాష్ట్రాలు తో కలిపి రేర్ ఎర్త్ కారిడార్ గుర్తింపు కూడా అభివృద్ధి కి చిహ్నం. రూ. 10,000 కోట్ల తో ఎంఎస్ఎంఈ ఫండ్ ఏర్పాటు, డెవీలూప్మెంట్ కూడా మంచి శుభపరిణామం. ఉద్యోగాల ఉత్పత్తి కోసం పరిశ్రమలు, విద్యా సంస్థలు అనుసంధానం చేయడం యువత కు మంచి ఊరట. సెమి కండక్టర్ 2.0 కోసం రూ. 40,000 కోట్ల కేటాయింపు అభినందనీయం.

## సమ్మెకు సమయాత్తం..



**జమ్మలమడుగు, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:**

కడప డీపీటీఓ నిరంకుశ వైఖరికి నిరసనగా గత 76 రోజులుగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కడప రీజనల్ కమిటీ నిర్వహిస్తున్న నిరవధిక రిలే నిరాహారదీక్షలు చేస్తున్నా సమస్యలను పరిష్కరించకుండా ఇంకా జరిలం చేస్తున్న డీపీటీవో మీద ఈ నెల 4వ తేదీన ఆమరణ నిరాహారదీక్షల ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని కోరుతూ ఉపాధ్యక్షులు పీవీ శివారెడ్డి ఆదివారం తెలిపారు. జమ్మలమడుగులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎన్ఎంయూఏ అత్యావసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి నాగేంద్ర అధ్యక్షత వహించగా జోనల్ కమిటీ మెంబర్స్ సుబ్బారావు, ఎస్ఎం వలీ, రీజనల్ ప్రెసిడెంట్ నాగముని, రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్, శ్రీను, రీజనల్ ఛైర్మన్ శేషన్న, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ కాంతయ్య, డిపో కార్యదర్శి ఎంజీసీవో రెడ్డి, గ్యారేజీ నాయకులు మహిళా సోదరీమణులు మరియు అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. విశిష్ట అతిథిగా మైదుకూరు డిపో కార్యదర్శి సుబ్బరాయుడు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న టీడీపీ కడప జిల్లా అధ్యక్షుడు సి.భూపేష్ సుబ్బరామిరెడ్డిని కలిసి 76 రోజులుగా జరుగుతున్న నిరవధిక రిలే నిరాహార దీక్షల గురించి తదుపరి జరగతలపెట్టిన ఆమరణ నిరాహారదీక్షల గురించి జరగబోవు కడప రీజనల్ వ్యాప్త సమ్మె గురించి రాఊష ఉపాధ్యక్షులు పీవీ శివారెడ్డి, రీజనల్ ఛైర్మన్ శేసన్న, రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్‌లు వివరించారు.

## వైభవంగా గిరి ప్రదర్శన వేడుకలు



**సోమల ఫిబ్రవరి 2 (ప్రభాతవార్త)**

సోమల సమీపంలో వెలసిన పరుస వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి గిరి ప్రదర్శన ప్రారంభమైంది. వందలాదిమంది భక్తులు గిరి ప్రదర్శనలో పాల్గొని వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ సమీపంలోని నరివేపానికొండ గిరి ప్రదర్శన చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. దీంతో ప్రతి పౌర్ణమి రోజు గిరి ప్రదర్శనలో పాల్గొని భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. పౌర్ణమి సందర్భంగా ఆలయ సమీపంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

# అంగరంగ వైభవంగా శ్రీ వెంకటేశ్వరని బ్రహ్మ రథోత్సవం







**పులివెందుల, ఫిబ్రవరి 1 , ప్రభాతవార్త :**

పట్నంలోని మెయిన్‌రోడ్‌లో ఉన్న శ్రీ పద్మావతి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గత నెల 25 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఆదివారం స్వామివారి బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ప్రత్యేక హోమాలు నిర్వహించి, ఉదయం స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంలో కొలువ తీర్చారు. అనంతరం ఆలయ చైర్మన్ వైయస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, నాలుగో వార్డ్ కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, కమిటీ సభ్యులు సాయి వారికి ప్రత్యేక పూజలు చేశారు, అనంతరం ఆలయ ఉభయ దారులకు దృశ్యాలతో సత్కరించారు, ఉదయం 10 గంటలకు స్వామివారి రథోత్సవం ప్రారంభమైంది. రథాన్ని లాగేందుకు భక్తాదులు పెద్ద సంఖ్యలోనే తరలివచ్చారు. స్వామివారికి ,పూజ చేసి కయా, కరపనాన్ని సమర్పించారు. ముఖ్యంగా ఇందులో యువత ఎక్కువ శాతం రథాన్ని లాగేందుకు ముందుకు వచ్చారు ఇందులో స్వామివారి రథాన్ని లాగడం వల్ల కళ్యాణం కానీ వారికి కళ్యాణం అవుతుందని ఒక నమ్మకం. ఈ రథోత్సవం మెయిన్ రోడ్డు మీద నుంచి, పూలంగళ్ళ సర్కిల్ చేరుకొని, అక్కడి నుంచి పాత గంగిరెడ్డి హాస్పిటల్ మీదగా బంగారు బజార్లలో నుంచి ఆలయం వద్దకు చేరుకుంది. అలాగే రథోత్సవం ముందర వివిధ రకాల వేషధారణలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎటువంటి సంఘటనలు అర్బన్ సీఐ సీతారామరెడ్డి తన సిబ్బందితో పర్యవేక్షించారు.

## సిమెంటు రోడ్డుకు భూమి పూజ

**మైదుకూరు, ఫిబ్రవరి 01, ప్రభాతవార్త:**



మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో 16 వార్డు నందు అభివృద్ధిలో భాగంగా సుమారు 7.50 లక్షల రూపాయల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు దాసరి బాబు, 16వ వార్డు కౌన్సిలర్ బి.ఎన్. నాగేశ్వరి, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ యాపరాలచిన్న, ధనపాల్ జగన్, బురుగోళ్ల చిన్న,ధనపాల రవి, బి ఎన్ శ్రీనివాసులు, బండి అమర్నాథ్, తుపాకుల రమణ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర షూటింగ్ బాల్ పోటీలకు ఆరు ఆణిముత్యాలు



**తంబళ్లపల్లె ఫిబ్రవరి 1 ప్రభాతవార్త ః**

ములకలచెరువు ఆక్స్ఫర్డ్ సిబిఎస్సి పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి షూటింగ్ బాల్ సబ్ జూనియర్ బాల,బాలికల జట్లు ఎంపిక చేశారు. అందులో తంబళ్లపల్లె మండలానికి చెందిన 6 మంది విద్యార్థులు ఈనెల 8వ తేదీన పల్నాడు జిల్లా సత్తెనపల్లి లో జరిగే రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికై తమ సత్తా చాటారు. తంబళ్లపల్లె మోడల్ స్కూల్ కు చెందిన కరీమున్నీసా, గౌస్ మహమ్మద్, అర్షాద్ తోపాటు కన్నెమడుగు హైస్కూల్ కు చెందిన రుషిత, మానస, ప్రియా ప్రవల్లిక లు షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మోడల్ స్కూల్ విద్యార్థులు పోటీ పరీక్షలతో పాటు క్రీడల్లో సైతం సత్ఫలితాలు సాధించడంపై ప్రిన్సిపల్ హేమంత్ కుమార్, కన్నెమడుగు హెడ్మాస్టర్ మదన్మోహన్, పిఈటిలు అధ్యాపక బృందాన్ని స్పెషల్ ఆఫీసర్ అమరనాథరెడ్డి, ఎంఈఓలు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు, ఎంపీడీవో బాపూజీ పట్నాయక్, ఏవో థామస్ రాజా, డిప్యూటీ ఎంపీడీవోలు ప్రసాద్, మారుతీ కుమార్, ఏపీఎం గంగాధర్, ఏపీవో అంజనప్ప అధికారులు ప్రశంసల జల్లు కురిపించారు.

# చదువుతో పాటు క్రమశిక్షణకు కూడా అధిక ప్రాధాన్యత





**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త**

చదువుతోపాటు క్రమశిక్షణకు బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ అధిక ప్రాధాన్యత ఇస్తుందని పాఠశాల నిర్వాహకులు బసిరెడ్డి శ్వేతా రెడ్డి తెలిపారు. స్థానిక యర్రగుంట్ల రోడ్డు లోని సినీ హబ్ లో ఏర్పాటు చేసిన బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ కార్పోరేట్ ఆఫీసును ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ముందుగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి కుటుంబ సభ్యులు ఎస్సారైటీ ఇంజనీరింగ్ కళాశాల ద్వారా విద్యారంగంలో వున్నారని, ఆ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకుల సహకారంతో విద్యార్థులను తీర్చి దిద్దారని వివరించారు. ప్రస్తుతం అదే తరహాలో బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ అనే ప్రాంఛేజీని రాష్ట్రం లో 4వ బ్రాంచ్ గా పట్టణంలో ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. ప్రస్తుతం నర్సరీ నుండి 6 వ తరగతి వరకు చిన్నారులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను ప్రొద్దుటూరులో అందించడం కోసం వారు ఈ ఏర్పాటు చేశారని వివరించారు. ఈ పాఠశాల ప్రొద్దుటూరు, పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రయోజనకరమని తెలిపారు. పాఠశాల యాజమాన్యం బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి మాట్లాడుతూ బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్‌లో ప్రొద్దుటూరు, పరిసర ప్రాంతాల వారి పిల్లలకు సుదూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా అధునాతన సౌకర్యాలతో, అత్యుత్తమ ప్రమాణాలతో విద్యను అందిస్తామని తెలిపారు. అనంతరం పాఠశాల నిర్వాహకురాలు శ్వేత రెడ్డి మాట్లాడుతూ తమ బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ లో చేరే పిల్లలకు చదువుతో పాటు క్రీడలలో ప్రోత్సహిస్తామని తెలిపారు. విద్యార్థుల ఆలోచన ధోరణి ప్రకారం ప్రపంచ స్థాయి ఉపాధ్యాయుల ద్వారా బోధన చేయిస్తామని వివరించారు. విద్యార్థులకు ప్రత్యేక ఆర్థిక అవగాహన, ఒత్తిడి లేని విద్య అందించడంతో పాటు తమ పాఠశాల క్యాంపస్‌ను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుతామని వివరించారు. తమ పాఠశాల విద్యార్థులకు మార్కుల కన్నా క్రమశిక్షణ ముఖ్యమని తెలిపారు. కాగా రాష్ట్ర షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్ పాఠశాల లో ఆయన మనుమడి కోసం అడ్మిషన్ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలు శ్రీనివాసుల రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామి రెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, లింగాపురం ఏజిఆర్ బ్యాంకు చైర్మన్ సిద్ధారెడ్డి నాగముని రెడ్డి, యువ నాయకులు బచ్చల ప్రతాప్, కొనిరెడ్డి హర్ష వర్ధన్ రెడ్డి, బసిరెడ్డి వీర కుమార్ రెడ్డి, బసిరెడ్డి వీర కళ్యాణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జనసేన మై ఫోర్స్ మహేష్ ఉమేష్‌లను సస్పెండ్ చేయాలి

**బి. కొత్తకోట ఫిబ్రవరి 1 ప్రభాతవార్త ;**

మదనపల్లి రింగ్ రోడ్డు నందు మొలకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మొరుసుకాపు రెడ్ల సంఘ నేత చంద్రశేఖర్‌రెడ్డిపై జనసేన నాయకులు గత నెల జనవరి 29వ తేదీ జనసేన నాయకులు మై ఫోర్స్ మహేష్, ఆయన సోదరుడు ఉమేష్, ఎంజి గ్రాండ్ హోటల్ సిబ్బంది కారు పార్కింగ్ విషయమై దాడి చేశారు. ఈ విషయమై తంబలపల్లె నియోజకవర్గం చెందిన మురుసుకాపురెడ్లు ఆదివారం చంద్రశేఖర్ రెడ్డిని పరామర్శించి ఆయనపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఆ సంఘ నేత మార్కిరి ఆంజనేయ రెడ్డి మాట్లాడుతూ జనసేన నాయకుల మహేష్, ఉమేష్‌లు తమ హోటల్‌కు సంబంధంలేని మున్సిపాలిటీ స్థలంలో కారు పార్కింగ్ చేస్తే చంద్రశేఖర్‌రెడ్డిపై దాడి చేయడం హేయమైన చర్యగా ఖండించారు. కర్ణాటక నుంచి వలస వచ్చి మదనపల్లెలో అరాచకాలు, దౌర్జన్యాలు చేసి ప్రజలను పీడిస్తున్నారని వీరి అరాచకాలని అరికట్టి జనసేన నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జనసేన నుండి వారిని సస్పెండ్ చేయకపోతే మదనపల్లి, తంబళ్లపల్లె నియోజకవర్గాలలోని మురుసు కాపుల ఆధ్వర్యంలో మండల స్థాయితో పాటు కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. చంద్రశేఖర్ రెడ్డిని శ్రీనాథ్ రెడ్డి, మస్తాన్ రెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, సర్పంచ్ గుట్టపాలెం జయరాం రెడ్డి, గుట్టపాలెం నరసింహారెడ్డి, నాయన బావి సిద్ధారెడ్డి, రాజారెడ్డి, మరవ పల్లి మస్తాన్ రెడ్డి, తరిగోడు బాబు రెడ్డి, మెడికల్ స్టోర్ శంకర్ రెడ్డి, కాచుపల్లి వెంకటసుబ్బారెడ్డి, దేవల చెరువు నరసింహారెడ్డి, కాండ్లమడుగు మధుకర్ రెడ్డి, సీతి వారి పల్లి సీతారాం రెడ్డి, కొండ కింద పల్లి కృష్ణారెడ్డి, ఎండి మస్తాన్, మగ్గాలు ఈశ్వర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, సుబ్బిరెడ్డి, కోట ఊరు జయచంద్రారెడ్డి, సిద్ధారెడ్డి, దాదం కృష్ణారెడ్డి, కేకుపల్లి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శత జయంతి ఉత్సవాల శిబిరం విజయవంతం



**బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బద్వేల్ నియోజకవర్గం పట్టణంలోని బిజివేముల వీరారెడ్డి కళాశాలలో కళాశాల విద్యార్థుల కోసం రెండు రోజుల శిబిరం శని, ఆదివారాలైన 31వ తేదీ మరియు 1వ తేదీలలో నిర్వహించారు. విద్యార్థులలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పెంపొందించాలనే ప్రధాన లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శిబిరం ముగింపు సందర్భంగా 1వ తేదీ సాయంత్రం 4½ గంటలకు బద్వేల్ పట్టణ పురవీధులలో ఘనంగా పద సంచలనం నిర్వహించారు. ఈ కార్యక్రమం పట్టణ ప్రజల్లో విశేష ఆకర్షణను పొందింది. ఈ కార్యక్రమంలో బద్వేల్ ఖండ్ సంఘ్ శాఖకు చెందిన చాలా రామకోటి రాజు, ఖండ కార్యవాహ రాజశేఖర్ రెడ్డి, జిల్లా ప్రచారక్ మహేష్ , సీనియర్ స్వయంసేవకులు అనాల ప్రసాద్, పెద్ది సుధాకర్, అక్కి సంజీవరెడ్డి, ఆవుల చిన్ని, పల్లె రమేష్ రెడ్డి, పెరుగు వెంకటయ్య, జయసుబ్బారెడ్డి, రఘునాథ్ రెడ్డి, పళ్లెం శెట్టి శ్రీనివాసులు, మధుల పల్లె సత్యం తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకులు బొమ్మన సుబ్బరాయుడు, బొమ్మన విజయ్, ధర్మశెట్టి వెంకటసుబ్బయ్య, ముఖం శ్రీనివాసులు తదితరులు పదసంచలనంలో పాల్గొని కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

## బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా బొమ్మన విజయ్

**బద్వేల్ అర్బన్ ఫిబ్రవరి 01 ప్రభాతవార్త :**



ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ సునీల్‌రెడ్డి నాయకత్వంలో నూతనంగా నియమితులైన రాష్ట్ర కార్యదర్శిగా బొమ్మన విజయ్ నియమించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా బొమ్మన విజయ్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకోవడం సంతోషకరమన్నారు, తమ పదవికి సహకరించిన సహకరించి రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్,భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు సునీల్ రెడ్డికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌కు, రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్‌కి,జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు దయాకర్‌రెడ్డికి, నాగోతు రమేష్ నాయుడుకి, రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్ రెడ్డికి, రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డికి, శ్రీశైల బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడుకి, కడప జిల్లా బిజెపి అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బారెడ్డికి నా వెంట ఉండి నన్ను నడిపిస్తున్న మా అన్న బొమ్మన సుబ్బరాయుడుకి మరియు ఇతర బిజెపి, బీజేవైఎం నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రోటరీ క్లబ్ ప్రెసిడెంట్‌గా కొవ్వు రమేష్ రెడ్డి

**ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త**



రోటరీ క్లబ్ ప్రొద్దుటూరు, రోటరీ ఐ హాస్పిటల్ ప్రొద్దుటూరు 2026 27 సంవత్సరానికి గానూ రోటరీ క్లబ్ ప్రొద్దుటూరు 15675 శాఖకు అధ్యక్షులుగా ప్రముఖ వ్యాపారస్తులు సంఘ సేవకులు కొవ్వూరు గ్రాండ్ అధినేత కొవ్వూరు రమేష్ రెడ్డి, కార్యదర్శిగా గండ్లూరు శ్రీధర్ శర్మ, ట్రెజరర్‌గా సీనియర్ రొటేరియన్ బాలాజీ ని రోటరీ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా రోటరీ సేవలను మరింత విస్తృత పరుస్తామన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో కోటా శివ కుమార్, బాల సూర్యరావు, అయూబ్ ఖాన్, ఖాదర్ బాషా, వెంకటేష్, నరసింహారావు, రాంప్రసాద్ రెడ్డి, గుర్రం రామకృష్ణ, సూర్య నారాయణ రెడ్డి, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

### అమ్మవారి బంగారు చిలకకు సహకరించిన

# ఉభయ దాతలకు ప్రత్యేక పూజలు





**బద్వేల్ అర్బన్ ఫిబ్రవరి 01 ప్రభాతవార్త :**

బద్వేల్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాలలో మాఘమాసం సందర్భంగా పౌర్ణమి పురస్కరించుకొని ఆదివారం ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు, సెక్రటరీ ఉరిమి శ్రీనివాసులు, మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత,స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి ఆధ్వర్యంలో వాసవి మాత అమ్మవారికి తెల్లవారుజామున వివిధ రకాల ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు, అనంతరం వాసవి మాత అమ్మవారికి బంగారు చిలుక కు సహకరించిన 102 మంది ఉభయ దాతలకు అమ్మవారి సన్నిధిలో వివిధ రకాల ప్రత్యేక పూజలను అభిషేకం కార్యక్రమాన్ని కనుల పండగగా నిర్వహించారు, అమ్మవారి ఉత్సవాలకు సహకరించిన పలువురు దాతలకు వాసవి మాత సన్నిధిలో శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాలను అందజేయడం జరిగింది,ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య వర్ధక సంఘం, యువజన సంఘం, మహిళా మండలి సభ్యులు మరియు పలువురు భక్తులు పాల్గొన్నారు, అనంతరం ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు సతీమణి కొండపల్లి దంపతులను మహిళా మండలి సభ్యులు శాలువాతో వారిని సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో యాదాల్ల కృష్ణమూర్తి, దర్శి సుబ్బరాజా, భూపాలం నాగరాజారావు, తుమ్మలపెంట వెంకటసుబ్బయ్య, ద్దిదుకుర్తి సుబ్బరాయుడు, చిన్ని నరసింహ, తులసి వెంకటసుబ్బయ్య, గంగిశెట్టి ధనలక్ష్మి, తులసి వరలక్ష్మి, కొండపల్లి లక్ష్మీకాంతమ్మ, ఉరిమి పద్మావతి,తో పాటు పలువురు కమిటీ సభ్యులు ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

## బీజేపీ కిసాన్ మోర్చ ఉపాదక్షునిగా సంగటి రామ మోహన్ రెడ్డి

**కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:**



కడప జిల్లా బీజేపీ కిసాన్ మోర్చ ఉపాదక్షునిగా పెండ్లిమర్రి మండలం, కొత్తపేటకు చెందిన సంగటి రామ మోహన్ రెడ్డినీ నియమించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారం కోసం పాటుపడుతానన్నారు. నన్ను కిసాన్ సన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, కడప జిల్లా అధ్యక్షుడు జంగేటి వెంకటసుబ్బారెడ్డి, కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు టి. కుమారస్వామి, మార్ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ వి. శశి భూషణ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అశోక్ కుమార్ రెడ్డి లకు ధన్యవాదములు తెలిపారు.

## రాష్ట్ర అండర్ 14 క్రికెట్ జట్టుకు ఇరగంరెడ్డి ఎంపిక

**రాయచోటి ఫిబ్రవరి 1 ప్రభాతవార్త**



రాయచోటి పట్టణంలోని ఎగువ అబ్బవరంకు చెందిన పప్పిరెడ్డి లిఖిత్ ఇరగం రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అండర్ 14 క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు అతని తల్లిదండ్రులు సుమలత, కిషోర్ కుమార్ రెడ్డి వార్తకు.తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బిడ్డ ఇటీవల జరిగిన జోనల్ మ్యాచ్ లో 96 పరుగులు చేసి ప్రతిభ కనబరిచినట్లు వారు తెలిపారు. అన్నమయ్య జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు తొలి క్రీడాకారునిగా గుర్తుంటుందని వారు ఆనందం వెలిబుచ్చారు. అతని గ్రామస్తులు కూడా తమ గ్రామానికె కాకుండా జిల్లాకు కూడా కీర్తి తెచ్చినాడని ఇరుగంరెడ్డిని అభినందించారు.

## బిటి కళాశాల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

### క్రీడా విద్యార్థులకు చార్డెడ్ అకౌంటెంట్‌చే విరాళం



అనిబిసెంట్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

**మదనపల్లె, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :**

రాష్ట్రంలోనే పేరు ప్రఖ్యాతలు పొందిన మదనపల్లె బిటి కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జిల్లా కేంద్రమైన మదనపల్లెలో జరిగింది. ఈ సందర్భంగా బిటి కళాశాల పూర్వ విద్యార్థి చార్టెడ్ అకౌంటెంట్‌గా ఉన్న మలిగి మధుసూదన్‌రెడ్డి క్రీడా విద్యార్థులకు పనిముట్లకు గానూ తనవంతు సాయంగా విరాళం అందజేశారు. తొలుత అనిబిసెంట్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ర్యాలీగా ఇండియన్ యూనియన్ క్లబ్ వరకు నిర్వహించారు. అనంతరం బెంగుళూరు రోడ్డు లోని ప్రముఖ పారిశ్రామికవేత్త టిఎన్.కుటుంబీకుల మామిడితోపులో అందరూ కలసి సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మలిగి మదుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ బిటి కళాశాలలో చదవడం నా అదృష్టంగా బావిస్తున్నా నన్నారు. బిటి కళాశాల పూర్వ విద్యార్థి ఎంఎస్.చంద్రశేఖర్‌రెడ్డిపై దాడి చేయడం అమానుషం అన్నారు. ఈ సమావేశంలో బిటి కళాశాల పూర్వ విద్యార్థి, మాజీ ఛైర్మన్ పులివెందుల పార్థసారథిరెడ్డి, జనసేన పార్టీ రాయల సీమ కోకన్వీనర్ రాందాస్‌చౌదరి, పూర్వ విద్యార్థులు కంచెర్ల శ్రీనివాసులునాయుడు, మాజీ కౌన్సిలర్ మదుసూదన్‌రెడ్డి, బిటికళాశాల లెక్చరర్ మలిగి భార్గవ్‌రెడ్డి, సాయిశేఖర్‌రెడ్డి, గంగారపు గౌతం, వైఎస్.మునిరత్నం, గుండాల రామచంద్ర, కొక్కంటి ఈశ్వర్, జివి.శివారెడ్డి, ఎస్‌కె.బాషా, శివకుమార్, ప్రసాద్, అలాం శ్రీనివాసులు, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రిని కలిసిన మండల టీడీపీ అధ్యక్షులు

**రామసముద్రం పిబ్రవరి 1 ప్రభాతవార్త**

రామసముద్రం మండల టిడిపి పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్ మదనపల్లి ఆదివారం విచ్చేసిన మంత్రి రాం ప్రసాద్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిశారు. మండల టీడీపీ పార్టీ విషయాలపై చర్చించుకున్నారు. మదనపల్లి నియోజకవర్గ టిడిపి నాయకులు మాజీ ఎమ్మెల్యే దొమ్మల పాటి రమేష్, రాష్ట్ర టిడిపి బిసి నాయకులు చిన బాబు ని కలిశారు.